@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512

మీ వార్త

AP EDITION

ప్రతి అక్షరం... ప్రజల కోసం

విజయవాడ

శనివారం 21 నవంబర్ 2026

సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు,
నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యం!



- రోబోటిక్ సర్జరీల నుంచి అవయవ మార్పిడి వరకు ఆధునిక సేవలు
- రూ.1,011 కోట్లతో భారీ వైద్య ప్రణాళికలు
- విజయవాడలో తొలి రోబోటిక్ సర్జరీ కేంద్రం.. ఐదు నగరాల్లో క్యాన్సర్ కేంద్రాలు
- ఐవీఎఫ్, బోన్‌మారో, అరుదైన వ్యాధుల చికిత్సకు ప్రత్యేక సదుపాయాలు
- విజయవాడలో రూ.45 కోట్లతో రోబోటిక్ సర్జరీ కేంద్రం

అమరావతి

రాష్ట్రంలోని ప్రభుత్వ బోధనా ఆసుపత్రులను అత్యాధునిక వైద్య కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా నాణ్యమైన వైద్య సేవలను ప్రభుత్వ రంగంలోనే అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా రోబోటిక్ శస్త్రచికిత్సలు, ఐవీఎఫ్ కేంద్రాలు, బోన్‌మారో మార్పిడి కేంద్రాలు, అవయవ మార్పిడి విభాగాలు, సమగ్ర క్యాన్సర్ చికిత్స కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించింది. వీటితో పాటు వైద్య విద్య, పరిశోధన, ఐసీయూ సదుపాయాలను బలోపేతం చేసేందుకు మొత్తం - మిగతా 3లో



యుద్ధాల వేళ భారత్ శాంతి సందేశం!

- సాంస్కృతిక బంధాలే ప్రపంచ శాంతికి భరోసా: ప్రధాని మోదీ
- పురానా ఖిలా వేదికగా తొలి ఎస్‌సీఓ నాగరికతల సంభాషణల వేదిక ప్రారంభం
- సభ్య దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి పిలుపు
- ప్రాచీన గ్రంథాల డిజిటలీకరణకు ఏఐ సాంకేతికత వినియోగించాలని సూచన
- ఉమ్మడి పరిశోధనలు, విశ్వవిద్యాలయాల మధ్య సహకారానికి ప్రతిపాదన
- బౌద్ధ వారసత్వం, సిల్క్ రూట్ ఆధారంగా హెరిటేజ్ సర్క్యూట్ల అభివృద్ధి
- సాంస్కృతిక ఉత్సవాలు, కళాకారుల మార్పిడితో దేశాల మధ్య సాన్నిహిత్యం

ఏపీఎండీసీకి మహర్దశ

- ఎన్ఎండీసీ స్థాయికి తీర్చిదిద్దుతాం!
- సంస్థను అత్యున్నత మైనింగ్ కంపెనీగా అభివృద్ధి చేయాలి
- వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఐపీఓకు వెళ్లేలా ప్రణాళిక
- 582 ఖనిజ ప్రాంతాల గుర్తింపు.. 209 క్లస్టర్లుగా విభజన
- పెండింగ్ లీజులు, రెన్యువల్స్ పరిష్కారంతో రూ.400 కోట్ల ఆదాయం



అమరావతి

రాష్ట్రంలోని అపారమైన ఖనిజ సంపదను ఆర్థికాభివృద్ధికి కీలక వనరుగా మలచుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ)ను జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) తరహాలో అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. ఖనిజ వనరులను కేవలం ఆదాయార్జనకే పరిమితం చేయకుండా, వాటికి అదనపు విలువ కల్పించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. అవసరమైన చోట ప్రైవేట్ ఏజెన్సీల సహకారం తీసుకుంటూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఖనిజ అన్వేషణ చేపట్టాలని ఆదేశించారు. గనుల శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, వాటి సమర్థ వినియోగం, వేలం ప్రక్రియ, ఆదాయార్జన అవకాశాలపై అధికారులతో చర్చించారు. ఏపీఎండీసీని స్టాక్ మార్కెట్‌లో నమోదు చేసేందుకు ఐపీఓకు వెళ్లే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఐపీఓ ప్రక్రియ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సంస్థ ఈక్విటీ - మిగతా 3లో

విమానాశ్రయ తరహాలో ఎయిర్ కాన్‌కోర్స్



- విశాఖ రైల్వే స్టేషన్‌కు అంతర్జాతీయ హంగులు!
- రూ.660 కోట్లతో ఆధునికీకరణ పనులు
- 8 నుంచి 14కు పెరగనున్న ప్లాట్‌ఫారాలు
- ఒకేసారి 4 వేల మంది ప్రయాణికులకు వసతి కల్పించే ఎయిర్ కాన్‌కోర్స్
- 2028 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యం

విశాఖపట్నం

విశాఖపట్నం రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికులకు అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక సౌకర్యాలు కల్పించడంతో పాటు, దేశంలోని అత్యుత్తమ రైల్వే స్టేషన్లలో ఒకటిగా తీర్చిదిద్దేందుకు ఆధునికీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇందుకోసం చేపట్టిన ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని గతంలో ఉన్న రూ.450 కోట్ల నుంచి రూ.660 కోట్లకు పెంచారు. ప్లాట్‌ఫారాల సంఖ్యను 8 నుంచి 14కు పెంచేందుకు - మిగతా 3లో



భారత్‌తో వాణిజ్య ఒప్పందాలకు ప్రపంచ దేశాల ఆసక్తి

- మరో 8-9 ద్వైపాక్షిక ఒప్పందాలకు అవకాశం
- భారత్‌లో డిజైన్, పరిశోధన కేంద్రాల ఏర్పాటుపై అమెరికా సంస్థల దృష్టి
- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్
- తాను ఏ దేశానికి వెళ్లినా భారత్‌తో ఎఫ్‌టీఏ కుదుర్చుకోవాలనే అభ్యర్థనలు వస్తున్నాయి

రైతులకు అండగా కేంద్రం నిలవాలి

- తుఫాన్ల దెబ్బకు విలవిలలాడుతున్న ఉద్యాన రైతులు!
- అదనపు సాయం అందించండి.. కేంద్రానికి చంద్రబాబు లేఖ
- 18 జిల్లాల్లో 29,960 హెక్టార్లలో పంట నష్టం.. 71,576 మంది రైతులకు దెబ్బ
- పునరుద్ధరణకు రూ.96.33 కోట్ల ఆర్థిక సహాయం కోరిన సీఎం



అమరావతి

వరుస తుఫాన్లతో తీవ్రంగా నష్టపోయిన ఉద్యాన పంటల రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి అదనపు ఆర్థిక సహాయం కోరింది. అర్నబ్, మురసు తుఫాన్ల ప్రభావంతో దెబ్బతిన్న తోటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు శుక్రవారం లేఖ రాశారు. తుఫాన్ల కారణంగా రైతులకు జరిగిన - మిగతా 3లో

ఎవరి ఆకలి తీరడం లేదో దేశానికి తెలుసు!



- మోదీ వ్యాఖ్యలకు రాహుల్ ఘాటు కౌంటర్.. ప్రభుత్వ ఆర్థిక విధానాలపై విమర్శలు
- పారిశ్రామికవేత్తలపై ప్రధాని వ్యాఖ్యలతో రాజకీయ దుమారం
- విమానాశ్రయాలు, ఓడరేవులు కొందరి చేతుల్లోనే: రాహుల్ ఆరోపణ
- నోట్ల రద్దు, జీఎస్టీతో చిన్న వ్యాపారాలకు నష్టం: కాంగ్రెస్ విమర్శ



సీఈసీ, ఈసీ నియామక చట్టంపై రీకాల్ పిటిషన్ తిరస్కరణ!

- ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనమే విచారిస్తుంది: సీజేఐ సూర్యకాంత్
- ప్రశాంత్ భూషణ్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు నిర్ణయం
- గతంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన ద్విసభ్య ధర్మాసనం
- జస్టిస్ దత్తా, జస్టిస్ శర్మ మధ్య భిన్నాభిప్రాయాలు
- సీఈసీ, ఈసీల ఎంపిక కమిటీ కూర్పుపై న్యాయస్థానంలో విచారణ
- న్యాయమూర్తి పదవీ విరమణ చేసినా విచారణకు అడ్డంకి లేదన్న సీజేఐ

పట్టాలెక్కనున్న తొలి స్వదేశీ బుల్లెట్ ట్రైన్!

- 2027 చివర్లో తొలి సర్వీసుకు సన్నాహాలు.. సూరత్--వాపి మధ్య ప్రారంభం
- 2027 మధ్య నాటికి ట్రాక్ ట్రయల్స్ ప్రారంభించే లక్ష్యం
- గంటకు 280 కి.మీ. వేగంతో ప్రయాణం
- BEML, ICF సంయుక్తంగా దీ28 రైలు తయారీ
- 8 కోచ్‌లు.. ఒకేసారి 557 మంది ప్రయాణించే అవకాశం
- ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు
- ముంబయి--అహ్మదాబాద్ మధ్య ప్రయాణ సమయం భారీగా తగ్గింపు



యుద్ధాల వేళ భారత్ శాంతి సందేశం!

ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా యుద్ధాలు, ఉద్రిక్తతలు, అశాంతిపైనే చర్చలు జరుగుతున్న ప్రస్తుత తరుణంలో భారత్ మాత్రం సాంస్కృతిక, నాగరికత సంబంధాలపై సంభాషణలు జరుపుతోందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ప్రపంచ శాంతికి ఈ సాంస్కృతిక అనుబంధాలే బలమైన భరోసాగా నిలుస్తాయని ఉద్ఘాటించారు. శుక్రవారం సాయంత్రం దిల్లీలోని చారిత్రాత్మక పురానా ఖిలా వేదికగా తొలి షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సివిలైజేషన్ డైలాగ్ ఫోరంను ప్రధాని ప్రారంభించి ప్రసంగించారు.

పురానా ఖిలా వేదికగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక సందేశం

మహాభారత కాలం నాటి విశేష చరిత్ర కలిగిన పురానా ఖిలా ఈ నాగరికత సంభాషణలకు సరైన వేదిక అని మోదీ కొనియాడారు. ప్రారంభోత్సవంలో ప్రదర్శించిన వేద మంత్రోచ్ఛారణలు, బౌద్ధ శాస్త్రం, హనుమంతుడి ప్రయాణ ఘట్టాలు వంటివి భారత సంస్కృతిని ప్రతిబింబించడమే కాకుండా యావత్ మానవాళికి ప్రేమ, ఐక్యత సందేశాన్ని అందించాయని ప్రధాని అన్నారు. 25 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎస్సీఓ కూటమి ఇప్పటివరకు భద్రత, ఆర్థిక, కనెక్టివిటీ రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసిందని, ఇప్పుడు సాంస్కృతిక సహకారం సభ్య దేశాల మధ్య బంధాల్ని మరింత దృఢంగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2025లో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన ఎస్సీఓ సదస్సులో ప్రధాని మోదీ చేసిన ప్రతిపాదన మేరకు, కేంద్ర సాంస్కృతిక, విదేశాంగ శాఖల ఆధ్వర్యంలో నవంబర్ 20 నుంచి 22 వరకు ఈ 3 రోజుల సదస్సు జరుగుతోంది.

ఎస్సీఓ దేశాలకు మోదీ కీలక ప్రతిపాదనలు

సభ్య దేశాల మధ్య సాంస్కృతిక వారసత్వాన్ని కొత్త తరానికి అందించడానికి ప్రధాని మోదీ పలు కీలక సూచనలు చేశారు.



ప్రాచీన గ్రంథాల డిజిటలీకరణ, ఏఐ ట్రాన్స్‌లేషన్- మ్యూజియంలు, గ్రంథాలయాల్లోని వేలాది ఏళ్ల నాటి తాళపత్ర గ్రంథాలు, అరుదైన చారిత్రక పత్రాల్ని డిజిటలైజ్ చేయాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) సాయంతో గొప్ప గొప్ప సాహిత్య గ్రంథాలను ఇతర భాషల్లోకి వేగంగా అనువదించి ప్రపంచానికి అందుబాటులోకి తీసుకురావాలి. ఈ అమూల్యమైన సంపదను డిజిటలైజేషన్ చేయడం, ప్రాచీన గ్రంథాలను వివిధ భాషల్లోకి అనువదించడం కోసం ఎస్సీఓ దేశాలన్నీ కలిసిగట్టుగా పనిచేయాలని సూచించారు.

ఉమ్మడిగా పరిశోధనలు- విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల సంయుక్తంగా పరిశోధనలు నిర్వహించాలి. దీని ద్వారా ఉమ్మడి చరిత్రకు సంబంధించిన కొత్త విషయాల్ని వెలుగులోకి తీసుకురావొచ్చని అన్నారు. దీని వల్ల ప్రపంచంలోని ఏ ప్రాంతానికి చెందిన యువత అయినా మరో దేశ సాంస్కృతిక వారసత్వాన్ని మరింత లోతుగా తెలుసుకోగలుగుతారని వివరించారు. బౌద్ధ వారసత్వ, సిల్క్ రూట్ సర్క్యూట్లు- ఎస్సీఓ దేశాల్లో ఉన్న సిల్క్ రూట్స్, బౌద్ధ వారసత్వంతో ముడిపడిన ఎన్నో చారిత్రక ప్రదేశాలు ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. ఈ ప్రాంతాల్ని అనుసంధానం చేస్తూ హెరిటేజ్ సర్క్యూట్లు, సాంస్కృతిక పర్యటక మార్గాల్ని అభివృద్ధి చేసే అవకాశాల్ని పరిశీలించాలని సూచించారు. ఉమ్మడి ప్రదర్శనలు, సాంస్కృతిక ఉత్సవాలు- సంయుక్త సాంస్కృతిక ఉత్సవాలు, కళాకారుల మార్పిడి కార్యక్రమాల ద్వారా వివిధ దేశాల కళలు, సంప్రదాయాలను కొత్త ప్రేక్షకులకు పరిచయం చేయవచ్చని చెప్పారు.

తొలుత ఇక్కడ 'వసుధైవ కుటుంబకం- ప్రపంచమంతా ఒకే కుటుంబం' థీమ్‌తో సివిలైజేషన్స్ అన్ కన్వర్జేషన్ పేరుతో నృత్య, సంగీత ప్రదర్శన నిర్వహించారు. 'అస్తిత్వ- ది ఎసెన్స్ ఆఫ్ అవర్ ఎగ్జిస్టెన్స్' పేరుతో భారత పురావస్తు, సాహిత్య వారసత్వాన్ని తెలిపే ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇక్కడ క్రీస్తుపూర్వం 1200 నుంచి క్రీస్తుశకం 1200 వరకు దిల్లీ చరిత్రకు సంబంధించిన తవ్వకాల్లో లభించిన వస్తువులు, ఇతర నిర్మాణ అవశేషాలు, కళాఖండాలు ఇందులో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కూడా పాల్గొన్నారు. నాగరికతలు ఒంటరిగా కాకుండా సంభాషణల ద్వారానే అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. ఈ ఫోరమ్ సహకారంలో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తుందని వ్యాఖ్యానించారు. ఉమ్మడి వారసత్వాన్ని ఉమ్మడి కార్యచరణ ప్రణాళికగా మార్చుకోవాలని అన్నారు. నవంబర్ 20-22 వరకు భారత్ 3 రోజుల ఈ ఫోరంను నిర్వహిస్తోంది. నవంబర్ 21, 22 తేదీల్లో నాలుగు ప్రధాన అంశాలపై చర్చలు జరగనున్నాయి.

పట్టాలెక్కనున్న తొలి స్వదేశీ బుల్లెట్ ట్రైన్!

భారత రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమవుతోంది. దేశీయ పరిజ్ఞానంతో రూపొందుతున్న తొలి స్వదేశీ బుల్లెట్ రైలు త్వరలో పట్టాలెక్కనుంది. 'దీ28' పేరుతో తయారవుతున్న ఈ హైస్పీడ్ రైలుకు సంబంధించి 2027 మధ్య నాటికి ట్రాక్ ట్రయల్స్ ప్రారంభించాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. అదే ఏడాది చివరి త్రైమాసికంలో తొలి వాణిజ్య సర్వీసును ప్రారంభించే అవకాశం ఉందని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. తొలుత సూరత్--వాపి మధ్య సేవలు ప్రారంభించి, అనంతరం దశలవారీగా ముంబయి వరకు విస్తరించనున్నారు.

280 కి.మీ. వేగంతో పరుగులు

భారత్‌లో తయారవుతున్న తొలి స్వదేశీ బుల్లెట్ రైలుకు దీ28గా పేరు పెట్టారు. ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (×జఖీ), భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్ (దీజుమీ) సంయుక్తంగా ఈ రైలును రూపొందిస్తున్నాయి. బెంగళూరులోని బీఈఎంఎల్ తయారీ కేంద్రంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. గంటకు 280 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేలా రైలును తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే తొలి బాడీ ఫ్రేమ్ నిర్మాణం పూర్తికాగా, ప్రస్తుతం నిర్మాణ నాణ్యత, సామర్థ్యాన్ని పరీక్షించే ప్రక్రియ కొనసాగుతోంది. 2027 మధ్యలో ట్రాక్ ట్రయల్స్ చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తదుపరి దశలో గంటకు 350 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే దీ35 రైలును అభివృద్ధి చేయాలని రైల్వే శాఖ భావిస్తోంది.

8 కోచ్‌లు.. 557 మంది ప్రయాణం

ఈ బుల్లెట్ రైలు సుమారు 202 మీటర్ల పొడవుతో ఎనిమిది కోచ్‌లను కలిగి ఉంటుంది. నాలుగు మోటార్ కార్లు, నాలుగు ట్రైలర్ కార్లతో నిర్మిస్తున్నారు. మొత్తం 557 మంది ప్రయాణించే సామర్థ్యం ఉంటుంది. ఇందులో ఏడు స్టాండర్డ్ క్లాస్ కోచ్‌లు, ఒక ఎగ్జిక్యూటివ్ క్లాస్ కోచ్ ఉంటాయి. స్టాండర్డ్ క్లాస్‌లో 3ఐ2 సీటింగ్, ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో 2ఐ2 సీటింగ్ ఏర్పాటు చేస్తున్నారు. రెండు వైపులా డ్రైవర్ క్యాబిన్లు, ఆపరేషన్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానమయ్యే ఆధునిక నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. అవసరాన్ని బట్టి



రెండు ఎనిమిది కోచ్‌ల రైళ్లను కలిపి 16 కోచ్‌లుగా కూడా నడిపే అవకాశం ఉంటుంది.

ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు

భారతీయ ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైలు అంతర్గత నిర్మాణాన్ని రూపొందిస్తున్నారు. సౌకర్యవంతమైన సీట్లు, కాళ్లు చాపుకునేందుకు తగినంత స్థలం, ఎల్ఈడీ లైటింగ్, లగేజీ ర్యాకులు, మొబైల్, ల్యాప్‌టాప్ ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నారు. అత్యాధునిక బయో డైజెస్టర్ టాయిలెట్లు, విశాలమైన కిటికీలు, ఒక కోచ్ నుంచి మరో కోచ్‌లోకి సులభంగా వెళ్లేందుకు సీల్డ్ గ్యాంగ్‌వే సదుపాయం కల్పిస్తున్నారు.

ముంబయి-అహ్మదాబాద్ మధ్య ప్రయాణం వేగవంతం

ముంబయి--అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రెండు నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం రోడ్డు మార్గంలో 8 నుంచి 9 గంటలు పడుతుండగా, బుల్లెట్ రైలు ద్వారా సుమారు గంటా 58 నిమిషాల్లోనే చేరుకోవచ్చని రైల్వే మంత్రి వెల్లడించారు. తొలుత సూరత్--వాపి మధ్య సర్వీసులు ప్రారంభించి, అనంతరం మిగిలిన మార్గాన్ని దశలవారీగా అందుబాటులోకి తీసుకురానున్నారు.

2017లో ప్రాజెక్టుకు శ్రీకారం

ముంబయి--అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టుకు 2017 సెప్టెంబరులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, జపాన్ ప్రధాని షింజో అబే సమక్షంలో పునాది పడింది. ఈ ప్రాజెక్టుకు జపాన్ తన హైస్పీడ్ రైలు సాంకేతికతను అందిస్తోంది. స్వదేశీ రైలు తయారీతో పాటు ఆధునిక రైల్వే సాంకేతికతలో భారత్ సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

భారత్‌తో వాణిజ్య ఒప్పందాలకు ప్రపంచ దేశాల ఆసక్తి

భారత్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునేందుకు ప్రపంచంలోని పలు దేశాలు ఆసక్తి చూపుతున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. అంతర్జాతీయ భాగస్వాములు భారత మార్కెట్‌లోకి ప్రవేశాన్ని విస్తరించుకోవడంతో పాటు, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. తాను ఏ దేశానికి వెళ్లినా భారత్‌తో ఎఫ్‌టీఏ కుదుర్చుకోవాలనే అభ్యర్థనలు వస్తున్నాయని చెప్పారు. దిల్లీలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) వార్షిక సర్వసభ్య సమావేశం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఈజిప్ట్, ఇటలీ నుంచి ఆసక్తి

తాను ఇటీవల ఈజిప్టలో పర్యటించినప్పుడు ఇరు దేశాల అధికార బృందాలు సమావేశమయ్యాయని గోయల్ వెల్లడించారు. ఎఫ్‌టీఏ అవకాశాలను పరిశీలించి, తదుపరి విధివిధానాలను ఖరారు చేయాలని ఇరు దేశాలు తమ అధికారులను కోరినట్లు తెలిపారు. ఇటలీ కూడా భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి ఆసక్తి చూపుతోందన్నారు. భారత్--యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై సంతకాలు, అమలు కోసం అక్కడి వ్యాపార వర్గాలు ఎదురుచూస్తున్నాయని పేర్కొన్నారు. పెరుగుతున్న వాణిజ్య ఒప్పందాల నెట్‌వర్క్ భారతీయ సంస్థలకు అంతర్జాతీయ మార్కెట్లలో కొత్త అవకాశాలను కల్పిస్తోందని వివరించారు.

85 ట్రిలియన్ డాలర్ల మార్కెట్లకు చేరువ

ప్రపంచ మార్కెట్లలో భారతదేశ ప్రాధాన్యతను పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పీయూష్ గోయల్ తెలిపారు.

ప్రస్తుతం భారత్ కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల పరిధిలో సుమారు 70 ట్రిలియన్ డాలర్ల విలువైన ప్రపంచ మార్కెట్లు ఉన్నాయని చెప్పారు. 2014కు ముందు ఈ విలువ 10 ట్రిలియన్ డాలర్లుగా ఉండేదని పేర్కొన్నారు. వచ్చే ఏడాది నుంచి ఏడాదిన్నర కాలంలో మరో 8--9 ద్వైపాక్షిక ఒప్పందాలు కుదిరితే అదనంగా 15 ట్రిలియన్ డాలర్ల మార్కెట్లకు అవకాశం ఏర్పడుతుందని అంచనా వేశారు. దీంతో మొత్తం 85 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ల పరిధిలోకి భారత్ చేరుతుందని, ఇది ప్రపంచ జీడీపీలో సుమారు 76 శాతానికి సమానమని వివరించారు. ఇతర ఆర్థిక వ్యవస్థలపై భారత్ ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని, అదే సమయంలో ప్రపంచ దేశాలు భారత్‌పై ఆధారపడేలా దేశ ఆర్థిక, వాణిజ్య విధానాలను అభివృద్ధి చేసుకోవాలని గోయల్ అభిప్రాయపడ్డారు.

చిన్న వ్యాపారులు, రైతులకూ ప్రయోజనాలు

వాణిజ్య ఒప్పందాల ప్రయోజనాలు కేవలం పెద్ద కంపెనీలకే పరిమితం కాకుండా చిరు వ్యాపారులు, రైతులు, చేతివృత్తులవారు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కూడా అందాలని గోయల్ స్పష్టం చేశారు. ఈ ఒప్పందాలు భారతీయ వ్యాపారాలకు కొత్త అవకాశాలను తెరుస్తాయని చెప్పారు. విదేశీ మార్కెట్లతో భారతీయ సంస్థలకు అనుసంధానం కల్పించేలా ఫిక్కీ తన అంతర్జాతీయ పరిధిని మరింత విస్తరించాలని సూచించారు. దేశీయ వ్యాపారాలకు, అంతర్జాతీయ అవకాశాలకు మధ్య పారిశ్రామిక మండలి వారధిగా నిలవాలని పిలుపునిచ్చారు. అమెరికాకు చెందిన పలు కంపెనీలు భారత్‌లో డిజైన్, పరిశోధన కార్యకలాపాలను విస్తరించాలని యోచిస్తున్నాయని పీయూష్ గోయల్ తెలిపారు. దేశంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుపైనా ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు. దిల్లీలో గురువారం జరిగిన 23వ ఇండో--యూఎస్ ఎకనామిక్ సమ్మిట్ ముగింపు సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో అందుబాటులో ఉన్న నైపుణ్యం కలిగిన మానవ వనరులను వినియోగించుకుని తమ వ్యాపార ప్రక్రియల నిర్వహణ కార్యకలాపాలను కూడా విస్తరించాలని కొన్ని అమెరికా కంపెనీలు భావిస్తున్నాయని చెప్పారు.

2027లో క్వాడ్ బిజినెస్ లీడర్స్ ఫోరమ్

మొట్టమొదటి క్వాడ్ బిజినెస్ లీడర్స్ ఫోరమ్ నిర్వహణకు భారతీయ వ్యాపార ప్రతినిధులను ఒకచోట చేర్చడంలో ఇండో-అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇతర పారిశ్రామిక సంస్థలు సహకరిస్తాయని ఆశిస్తున్నట్లు గోయల్ తెలిపారు. వ్యాపారవేత్తలు, ప్రభుత్వ అధికారులు, విధాన నిపుణులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి వాణిజ్య భాగస్వామ్యాలను ప్రోత్సహించడమే ఈ ఫోరమ్ లక్ష్యమని పేర్కొన్నారు. 2027 ప్రారంభంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నాలుగు క్వాడ్ దేశాలు నవంబర్ 17న మనీలాలో ప్రకటించాయని వివరించారు.

ఎవరి ఆకలి తీరడం లేదో దేశానికి తెలుసు!

ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. పారిశ్రామికవేత్తలకు పన్ను రాయితీలు కల్పించినప్పటికీ ఉద్యోగుల జీతాలు పెంచడం, కొత్త ఉద్యోగాల కల్పనలో ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదన్న ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. అసలు ఎవరి ఆకలి తీరడం లేదో దేశ ప్రజలకు తెలుసంటూ ఎక్స్ వేదికగా ఘాటు విమర్శలు చేశారు. ప్రభుత్వ ఆర్థిక విధానాలు, కార్పొరేట్ రంగానికి కల్పిస్తున్న ప్రయోజనాలపై ప్రశ్నలు సంధించారు.

మోదీ వ్యాఖ్యలకు రాహుల్ కౌంటర్

దిల్లీలో జరిగిన ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) శతాబ్ది సదస్సులో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించారు. పారిశ్రామికవేత్తలపై ప్రధాని చేసిన వ్యాఖ్యలు వారి తప్పులను ఎత్తిచూపడం కాదని, ప్రభుత్వ వైఫల్యాలను బయటపెట్టినట్లుగా ఉన్నాయని విమర్శించారు. విమానాశ్రయాలు, ఓడరేవులు, గనులు, అడవులు, విద్యుత్, బొగ్గు, రహదారులు వంటి కీలక రంగాలు కొందరి చేతుల్లో కేంద్రీకృతమయ్యాయని ఆరోపించారు. ఇంతటి ప్రయోజనాలు పొందుతున్న సంస్థలు ఎన్ని ఉద్యోగాలు కల్పించాయని ప్రశ్నించారు.

చిన్న పరిశ్రమలకు ఇబ్బందులు: రాహుల్

ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషించే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ) పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ విధానాల వల్ల తీవ్రంగా దెబ్బతిన్నాయని రాహుల్ ఆరోపించారు. గుత్తాధిపత్య ధోరణుల వల్ల మార్కెట్‌లో పోటీ తగ్గి, ధరలు పెరిగే పరిస్థితి ఏర్పడుతోందని అభిప్రాయపడ్డారు. ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువత ప్రభుత్వ విధానాల పట్ల అసంతృప్తితో ఉన్నారని విమర్శించారు.

ప్రతిపక్ష నేతలా మాట్లాడారు: ఖర్గే

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సైతం ప్రధాని వ్యాఖ్యలపై విమర్శలు గుప్పించారు. 12 ఏళ్ల పాలన తర్వాత తన ప్రభుత్వ వైఫల్యాలకు వ్యాపార వర్గాలను బాధ్యులను చేస్తూ మోదీ ప్రతిపక్ష నేతలా మాట్లాడారని ఎక్స్‌లో పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో అధిక వృద్ధి నమోదైందని చెబుతూ, ప్రస్తుత ప్రభుత్వం కొందరు పెట్టుబడిదారులకు దేశ వనరులను అప్పగిస్తోందని ఆరోపించారు. ఆరోగ్యకరమైన పోటీ లేకపోవడం వల్ల భారత ఉత్పత్తుల నాణ్యత, అంతర్జాతీయ బ్రాండ్ విలువ దెబ్బతింటున్నాయని విమర్శించారు.

మేక్ ఇన్ ఇండియాపై కాంగ్రెస్ విమర్శలు

దేశంలో ఉద్యోగావకాశాలు తగ్గడం, పొదుపులు క్షీణించడం, ద్రవ్యోల్బణం పెరగడం వంటి సమస్యలను ఖర్గే ప్రస్తావించారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిస్థితిపైనా ఆందోళన వ్యక్తం చేశారు. 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ఆశించిన ఫలితాలు ఇవ్వడం లేదని, దిగుమతులపై ఆధారపడే పరిస్థితి పెరుగుతోందని విమర్శించారు. ఆర్థిక వ్యవస్థ కొందరి చేతుల్లో కేంద్రీకృతం కావడం దేశానికి నష్టదాయకమని వ్యాఖ్యానించారు.

పన్ను రాయితీలిచ్చినా ఉద్యోగాలేవి?

అంతకుముందు ఫిక్కీ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతూ, వ్యాపార అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టిందని వివరించారు. 2014లో 30 శాతంగా ఉన్న ప్రాథమిక కార్పొరేట్ పన్ను రేటును 22 శాతానికి తగ్గించామని, వ్యక్తిగత ఆదాయపు పన్నులోనూ రాయితీలు కల్పించామని గుర్తుచేశారు. అయినప్పటికీ పారిశ్రామికవేత్తలు ఉద్యోగుల వేతనాలను పెంచడం, కొత్త ఉద్యోగాలను సృష్టించడంలో మరింత చొరవ చూపాలని సూచించారు.

కేంద్ర విధానాలపై జైరాం రమేశ్ విమర్శలు

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ప్రధాని వ్యాఖ్యలపై స్పందించారు. ద్రవ్యోల్బణం, ఉపాధి కల్పన, ప్రైవేటు పెట్టుబడుల అంశాల్లో ప్రభుత్వం ఆశించిన ఫలితాలు సాధించలేదని విమర్శించారు. సంపద సృష్టించే పారిశ్రామికవేత్తలపై ప్రధాని అసహనం వ్యక్తం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. దర్యాప్తు సంస్థల చర్యలతో పరిశ్రమల్లో ఆందోళనకర వాతావరణం నెలకొందని, చిన్న వ్యాపారాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆరోపించారు.

దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగొద్దు

మరోవైపు నియోజకవర్గాల పునర్విభజన అంశంపైనా జైరాం రమేశ్ స్పందించారు. ఈ ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కాంగ్రెస్ కోరుతోందని తెలిపారు. లోక్‌సభ స్థానాల సంఖ్య 543గానే కొనసాగించాలని, రాష్ట్రాలవారీగా సీట్ల పంపిణీలో మార్పులు చేయకూడదని, మహిళలకు మూడో వంతు స్థానాలు కేటాయించాలని, ఈ ఏర్పాట్లపై 25 ఏళ్లపాటు ఎలాంటి మార్పులు ఉండకూడదని కాంగ్రెస్ ప్రతిపాదిస్తున్నట్లు వివరించారు. జనగణన అనంతరం రాజ్యాంగంలోని ఆర్టికల్ 82 ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యపరంగా నష్టం జరిగే అవకాశం ఉందని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. ఈ అంశంపై ఇండియా కూటమి పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఉందని పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల ముగింపు, శీతాకాల సమావేశాల నిర్వహణపై కూడా జైరాం రమేశ్ పలు ప్రశ్నలు లేవనెత్తారు

సీఈసీ, ఈసీ నియామక చట్టంపై రీకాల్ పిటిషన్ తిరస్కరణ!

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామక చట్టం చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్ల విచారణలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశాన్ని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన భిన్నాభిప్రాయాల తీర్పును వెనక్కి తీసుకోవాలని కోరుతూ దాఖలైన రీకాల్ పిటిషన్‌ను విడిగా విచారించేందుకు నిరాకరించారు.

ఐదుగురు సభ్యుల ధర్మాసనం ముందుకే..

న్యాయవాది ప్రశాంత్ భూషణ్ దాఖలు చేసిన రీకాల్ పిటిషన్ సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ముందుకు వచ్చింది. రీకాల్ దరఖాస్తు, రిఫరెన్స్ ఉత్తర్వులపై అభ్యంతరాలు, 2023 నాటి సీఈసీ, ఈసీల నియామక చట్టం రాజ్యాంగబద్ధత వంటి అంశాలన్నింటినీ ఐదుగురు సభ్యుల ధర్మాసనమే పరిశీలిస్తుందని సీజేఐ తెలిపారు. ఈ పిటిషన్‌ను తిరిగి పాత ధర్మాసనం ముందుకు పంపాలన్న ప్రశాంత్ భూషణ్ అభ్యర్థనను అంగీకరించలేదు.

న్యాయమూర్తి పదవీ విరమణ చేసినా విచారణ

గతంలో భిన్నాభిప్రాయం వ్యక్తం చేసిన న్యాయమూర్తుల్లో ఒకరు త్వరలో పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో రీకాల్ పిటిషన్‌ను వచ్చే వారంలోనే విచారించాలని ప్రశాంత్ భూషణ్ కోరారు. దీనిపై స్పందించిన సీజేఐ.. ధర్మాసనంలోని న్యాయమూర్తుల్లో ఒకరు పదవీ విరమణ చేసినా రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశాన్ని విచారించవచ్చని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ఐదుగురు సభ్యుల ధర్మాసనం ముందే లేవనెత్తాలని సూచించారు.

ద్విసభ్య ధర్మాసనంలో భిన్నాభిప్రాయాలు

సీఈసీ, ఈసీల నియామక ప్రక్రియను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను గతంలో జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. అయితే ఈ కేసును విస్తృత ధర్మాసనానికి నివేదించాలా? లేదా? అనే అంశంపై ఇద్దరు న్యాయమూర్తుల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. జస్టిస్ దత్తా ఈ పిటిషన్లను ద్విసభ్య ధర్మాసనమే విచారించవచ్చని అభిప్రాయపడగా, రాజ్యాంగపరమైన కీలక అంశాలు ముడిపడి ఉన్నందున ఐదుగురు సభ్యుల ధర్మాసనం పరిశీలించాలని జస్టిస్ శర్మ పేర్కొన్నారు. 2023 నాటి చట్టం ప్రకారం సీఈసీ, ఈసీల ఎంపిక కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసిన కేంద్ర మంత్రి సభ్యులుగా ఉంటారు. గతంలో ఈ ఎంపిక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఉన్న పాత్రను తొలగించడాన్ని సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఎన్నికల సంఘం స్వతంత్రత, తటస్థతకు ఈ చట్టం విఘాతం కలిగిస్తోందని పిటిషనర్లు వాదిస్తున్నారు.

ఎన్నికల సంఘం స్వతంత్రతపై ప్రశ్నలు

జస్టిస్ దీపాంకర్ దత్తా తన అభిప్రాయంలో ఎన్నికల సంఘం స్వతంత్రత, తటస్థతపై ఆందోళనలు వ్యక్తం చేశారు. స్వేచ్ఛాయుత ఎన్నికలు నిర్వహించేందుకు 2023 చట్టం రాజ్యాంగ ప్రమాణాలకు అనుగుణంగా ఉందా? అనే ప్రశ్నను లేవనెత్తారు. మరోవైపు జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ఈ అంశంలో కీలకమైన న్యాయపరమైన ప్రశ్నలు ఉన్నందున విస్తృత ధర్మాసనం పరిశీలన అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ భిన్నాభిప్రాయాల నేపథ్యంలోనే కేసు సీజేఐ ముందుకు వచ్చింది.

రైతులకు అండగా కేంద్రం నిలవాలి

-మొదటిపేజీ తరువాయి

నష్టాన్ని వివరిస్తూ, ఉద్యాన పంటల పునరుద్ధరణతో పాటు రైతులకు ఆర్థికంగా అండగా నిలవాల్సిన అవసరాన్ని లేఖలో ప్రస్తావించారు.

18 జిల్లాల్లో భారీ పంట నష్టం

ఈ ఏడాది అక్టోబర్ 28, నవంబర్ 2 తేదీల్లో వరుసగా రాష్ట్రాన్ని తాకిన అర్నబ్, మురసు తుఫాన్ల కారణంగా ఉద్యాన రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలోని 18 జిల్లాల్లో మొత్తం 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వివరించారు. ఈ ప్రకృతి విపత్తుల ప్రభావంతో 71,576 మంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో తుఫాన్లు విరుచుకుపడటంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

అర్నబ్ తుఫానుతో అరటి రైతులకు భారీ దెబ్బ

అర్నబ్ తుఫాను ప్రభావం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్రంగా కనిపించిందని సీఎం వివరించారు. మొత్తం 215 మండలాల్లో 23,211 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ముఖ్యంగా అరటి సాగుకు భారీ నష్టం వాటిల్లిందని, ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు వెల్లడించారు. ఈదురుగాలులు, భారీ వర్షాల కారణంగా అరటి చెట్లు నేలకొరిగి, పంట దిగుబడితో పాటు రైతుల పెట్టుబడులు కూడా నష్టపోయాయని వివరించారు.

మురసు తుఫానుతో మరోసారి నష్టం

అర్నబ్ తుఫాను నష్టాల నుంచి కోలుకోకముందే మురసు తుఫాను మరోసారి ఉద్యాన రైతులపై ప్రభావం చూపిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ తుఫాను కారణంగా 108 మండలాల్లో 6,748 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. వరుస ప్రకృతి విపత్తులతో తోటలు దెబ్బతినడం, పంటల ఉత్పత్తి తగ్గడం, రైతులకు ఆదాయం నిలిచిపోవడం వంటి సమస్యలు తలెత్తాయని వివరించారు.

రూ.96.33 కోట్ల అదనపు సాయం కోరిన సీఎం



దెబ్బతిన్న ఉద్యాన తోటలను తిరిగి పునరుద్ధరించేందుకు, రైతులకు అవసరమైన ఆర్థిక చేయూత అందించేందుకు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద అదనంగా రూ.96.33 కోట్ల నిధులు మంజూరు చేయాలని చంద్రబాబు కేంద్ర మంత్రిని కోరారు. పంట నష్టంతో ఇబ్బందులు పడుతున్న రైతులు తిరిగి సాగు చేపట్టేందుకు ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఉద్యాన పంటల పునరుద్ధరణ, దెబ్బతిన్న తోటల సంరక్షణ, రైతుల జీవనోపాధి నిలబెట్టేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

కొబ్బరి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి

తుఫాన్ల ప్రభావంతో కొబ్బరి తోటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని ముఖ్యమంత్రి లేఖలో ప్రస్తావించారు. కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల తదితర జిల్లాల్లో గాలుల ధాటికి కొబ్బరి చెట్లు మొవ్వ విరిగి పనికిరాకుండా పోయాయని వివరించారు. ఈ విధంగా దెబ్బతిన్న కొబ్బరి చెట్లను తొలగించడం, కొత్త మొక్కలు నాటడం, తోటలను తిరిగి అభివృద్ధి చేయడం కోసం కొబ్బరి అభివృద్ధి బోర్డు (కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు) ద్వారా ఆర్థిక సహకారం అందించాలని కోరారు.

రైతులకు అండగా కేంద్రం నిలవాలి

వరుస తుఫాన్లతో నష్టపోయిన ఉద్యాన రైతులకు సకాలంలో సహాయం అందకపోతే భవిష్యత్తులో సాగు కొనసాగించడం కష్టమయ్యే పరిస్థితి ఉందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. తోటల పునరుద్ధరణకు అవసరమైన నిధులు, సాంకేతిక సహకారం అందించడం ద్వారా రైతులు తిరిగి సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉంటుందని చంద్రబాబు తన లేఖలో వివరించారు. రాష్ట్రంలో ఉద్యాన రంగాన్ని కాపాడటంతో పాటు రైతుల ఆర్థిక భద్రతకు కేంద్ర ప్రభుత్వం తగిన సహకారం అందించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యం!

-మొదటిపేజీ తరువాయి

రూ.1,011 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేసింది.

ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో అత్యాధునిక రోబోటిక్ శస్త్రచికిత్స విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆరోగ్య శాఖ నిర్ణయించింది. మొదటి విడతలో విజయవాడలోని ప్రభుత్వ బోధనా ఆసుపత్రిలో రూ.45 కోట్ల వ్యయంతో రోబోటిక్ సర్జరీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రం అందుబాటులోకి వస్తే క్లిష్టమైన శస్త్రచికిత్సలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించేందుకు అవకాశం ఉంటుంది. తదుపరి దశలో విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రి (కేజీహెచ్), కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోనూ ఈ సేవలను విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

ఐదు నగరాల్లో ఐవీఎఫ్ కేంద్రాలు

సంతానలేమి సమస్యలతో బాధపడుతున్న దంపతులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఆధునిక చికిత్స అందించేందుకు ఐవీఎఫ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. గుంటూరు, అనంతపురం, విజయనగరం, కాకినాడ, తిరుపతిలోని ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో ఈ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రతిపాదించారు. వీటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా బోన్‌మారో మార్పిడి కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఖరీదైన వైద్య చికిత్సలను పేదలకు అందుబాటులోకి తీసుకురావడంలో ఈ కేంద్రాలు కీలకంగా మారనున్నాయి.

ఐదు నగరాల్లో సమగ్ర క్యాన్సర్ చికిత్స కేంద్రాలు

క్యాన్సర్ బాధితులకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు రాష్ట్రంలో ఐదు సమగ్ర క్యాన్సర్ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అనంతపురం, మచిలీపట్నం, విజయవాడ, శ్రీకాకుళం, ఒంగోలులో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం సుమారు రూ.500 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహాయం పొందేందుకు కేంద్ర అణుశక్తి శాఖకు ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించడం, ఆధునిక పరీక్షలు, చికిత్సా సదుపాయాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించనున్నారు.

కిడ్నీ పరిశోధన, అవయవ మార్పిడి కేంద్రాలు

కిడ్నీ సంబంధిత వ్యాధుల చికిత్స, పరిశోధనకు ప్రాధాన్యమిస్తూ రూ.163.52 కోట్లతో ప్రత్యేక కిడ్నీ పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. మరోవైపు ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి చికిత్సలను అందుబాటులోకి తీసుకురావాలని ఆరోగ్య శాఖ భావిస్తోంది. దీనివల్ల కిడ్నీ



తదితర అవయవాల మార్పిడి అవసరమైన రోగులకు ప్రభుత్వ వైద్య వ్యవస్థలోనే మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుంది.

అరుదైన వ్యాధులకు ప్రత్యేక కేంద్రం

అరుదైన వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం రూ.17 కోట్లు కేటాయించారు. అరుదైన వ్యాధుల నిర్ధారణ, చికిత్స, నిరంతర వైద్య పర్యవేక్షణకు అవసరమైన సదుపాయాలను ఈ కేంద్రంలో అభివృద్ధి చేయనున్నారు.

మూడు నగరాల్లో బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలు

బోన్‌మారో మార్పిడి చికిత్సలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. విశాఖపట్నం, గుంటూరు, కర్నూలులోని ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో రూ.48 కోట్ల అంచనా వ్యయంతో బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రక్త సంబంధిత తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ కేంద్రాలు ఉపయోగపడనున్నాయి.

వైద్య విద్య, ఐసీయూ విభాగాలకు బలోపేతం

వైద్య విద్యా ప్రమాణాలను పెంచడంతో పాటు వైద్య పరిశోధనకు ప్రోత్సాహం అందించేందుకు రూ.180 కోట్లతో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ పబ్లిక్ హెల్త్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలను మెరుగుపరిచేందుకు రూ.65 కోట్లతో ఐసీయూ విభాగాలను బలోపేతం చేయనున్నారు. అవసరమైన పడకలు, వెంటిలేటర్లు, వైద్య పరికరాలను సమకూర్చడంపై దృష్టి పెట్టనున్నారు.

వైద్య కళాశాలల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఈ ప్రతిపాదనలపై మంగళగిరిలోని ఏపీఐఐసీ ప్రాంగణంలో ఉన్న రాష్ట్ర ఆరోగ్య శాఖ కార్యాలయంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో వైద్య విద్యార్థులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన శిక్షణ అందించాలని సూచించారు. కొత్తగా మంజూరైన ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రోగుల అవసరాలకు అనుగుణంగా ఐసీయూ పడకలు, వెంటిలేటర్లను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు. వైద్య విద్యా కోర్సుల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.

రూ.7,369 కోట్ల సాయం కోసం ప్రతిపాదనలు

రాష్ట్రానికి స్టేట్ స్పెసిఫిక్ అసిస్టెన్స్/స్కీమ్ ఫ్రేమ్‌వర్క్ కింద రూ.7,369 కోట్ల ఆర్థిక సహాయం పొందేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని ఆధునీకరించడంతో పాటు వైద్య విద్య, పరిశోధన, అత్యవసర వైద్య సేవలకు అవసరమైన నిధులను సమీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో డీహెచ్ఎఫ్‌డబ్ల్యూ, డీపీఎచ్, ఏపీఎంఎస్ఐడీసీకి చెందిన ఉన్నతాధికారులు, చీఫ్ ఇంజినీర్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శబరిమల యాత్ర - ఏపీ డీజీపీ కార్యాలయానికి కేరళం పోలీసులు కీలక సూచనలు

శబరిమల యాత్రికులకు కేరళం పోలీసులు కీలక సూచనలు చేశారు. మండల-మకరవిళక్కు యాత్ర దృష్ట్యా శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి వచ్చే భక్తుల రద్దీని నియంత్రించడానికి, ఎలాంటి తొక్కిసలాటలకు తావులేకుండా దర్శనం కల్పించడానికి కేరళం పోలీసులు కొన్ని సూచనలు చేస్తూ వాటిని రాష్ట్ర డీజీపీ కార్యాలయానికి పంపించారు. అయ్యప్ప స్వామి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడు ఆన్‌లైన్ వర్చువల్ క్యూ బుకింగ్ చేసుకోవడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. రోజుకు గరిష్టంగా 80 వేల మంది భక్తులను మాత్రమే అనుమతిస్తామని పేర్కొంటూ, యాత్రికులంతా తమ మార్గదర్శకాలను విధిగా పాటించాలని అన్నారు.

శబరిమల దర్శనానికి వచ్చే అయ్యప్ప భక్తులందరూ ముందస్తుగా ఆన్‌లైన్‌లో వర్చువల్ క్యూ బుకింగ్ పూర్తి చేసుకోవాలని కేరళం పోలీసులు తెలిపారు. గతంలో పంబ వద్ద ఉన్న రియల్-టైమ్ స్పాట్ బుకింగ్ కౌంటర్లను ప్రస్తుతం నీలక్కల్‌కు మార్చామన్నారు. స్పాట్ బుకింగ్ అవసరమైన భక్తులు ముందుగా నీలక్కల్ చేరుకుని, ప్రక్రియ పూర్తి చేసుకున్న తర్వాతే పంబకు వెళ్లాలని, నీలక్కల్‌లో రోజుకు గరిష్టంగా 10 వేల మందికి మాత్రమే స్పాట్ బుకింగ్ సదుపాయం ఉంటుందన్నారు.

ఎరుమేలి--పంబ, వండిపెరియార్ సత్రం--పుల్లుమేడు అటవీ మార్గాల ద్వారా నడిచి వచ్చే భక్తుల వద్ద కూడా చెల్లుబాటు అయ్యే ఆన్‌లైన్ లేదా స్పాట్ బుకింగ్ రసీదు ఉండాలని తెలిపారు. అంతేగాక ఈ మార్గాల్లో రోజుకు గరిష్టంగా రెండు వేల మందికి స్పాట్ బుకింగ్ ఏర్పాట్లు చేశారన్నారు. పంబ వద్ద పార్కింగ్ సదుపాయాలు పరిమితంగా ఉన్నందున, ప్రైవేట్ వాహనాల్లో వచ్చే భక్తులు తమ వాహనాలను నీలక్కల్ బేస్ క్యాంప్‌లో పార్క్ చేయాలని, అక్కడి నుంచి కేరళం ఆర్టీసీ చైన్ సర్వీస్ బస్సుల ద్వారా పంబకు చేరుకోవాలన్నారు. కేరళం హైకోర్టు ఆదేశాల మేరకు నీలక్కల్ నుంచి పంబ వరకు రహదారికి ఇరువైపులా వాహనాలను పార్క్ చేయడం పూర్తిగా నిషేధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కేరళం పోలీసులు హెచ్చరించారు. 14 మంది ప్రయాణికుల సామర్థ్యం వరకు ఉన్న వాహనాలు భక్తులను పంబ వద్ద దించి, తిరిగి పార్కింగ్ కోసం నీలక్కల్‌కు వచ్చేయాలని 14 సీట్ల కంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న ప్రైవేట్ బస్సులు, ఇతర భారీ వాహనాలను పంబ వరకు అనుమతించేది లేదన్నారు. భక్తులు తమ దుస్తులను పంపా నదిలో వదిలివేయడం పూర్తిగా నిషేధమని, పంపా నది పరిశుభ్రతను కాపాడటానికి, పరిసరాల పర్యావరణ పరిరక్షణకు యాత్రికులందరూ పూర్తి సహకారం అందించాలని కోరారు.

ఏపీఎండీసీకి మహర్దశ..

-మొదటిపేజీ తరువాయి

విలువ ఆధారంగా ఐపీఓ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. ఈ మేరకు అధికారులు సంబంధిత ప్రతిపాదనలను ముఖ్యమంత్రికి సమర్పించారు.

ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళిక

రాష్ట్రంలో ఖనిజ వనరుల అన్వేషణను మరింత వేగవంతం చేయాలని సీఎం సూచించారు. కొత్తగా గుర్తించిన ఖనిజ నిక్షేపాలను సమర్థంగా వినియోగించుకునేందుకు వచ్చే ఐదేళ్లకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. ఖనిజాల తవ్వకాలు, వేలం ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో లభించే ఖనిజ సంపదకు స్థానికంగానే అదనపు విలువ కల్పించే పరిశ్రమలను ప్రోత్సహించాలని, తద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రాష్ట్రానికి మరింత ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు.

209 క్లస్టర్లుగా ఖనిజ ప్రాంతాల విభజన

రాష్ట్రవ్యాప్తంగా ఖనిజ నిక్షేపాలను గుర్తించేందుకు ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగిస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం 74,860 చదరపు కిలోమీటర్ల పరిధిలో 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలను గుర్తించినట్లు తెలిపారు. వీటిని 209 క్లస్టర్లుగా విభజించి ఖనిజ అన్వేషణకు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గుర్తించిన ప్రాంతాల్లో ఖనిజాల లభ్యత, నాణ్యత, వాణిజ్యపరమైన అవకాశాలను అంచనా వేసి తదుపరి చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

రేర్ ఎర్త్ కార్పొరేషన్ ఏర్పాటుకు ఆమోదం

ఆంధ్రప్రదేశ్ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు చంద్రబాబు ఆమోదం తెలిపారు. అరుదైన ఖనిజాలుగా గుర్తింపు పొందిన రేర్ ఎర్త్ మూలకాల అన్వేషణ, వెలికితీతతో పాటు వాటికి అదనపు విలువ కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఎలక్ట్రానిక్స్, ఆధునిక సాంకేతిక పరిశ్రమలు, ఇతర కీలక రంగాల్లో వీటికి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పెండింగ్ లీజుల పరిష్కారంతో రూ.400 కోట్ల ఆదాయం

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న క్వారీ లీజు దరఖాస్తులు, రెన్యువల్స్ అంశంపైనా సమీక్షలో చర్చించారు. ప్రస్తుతం సుమారు 6,500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్ పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వివరించారు. వీటిని పరిష్కరించేందుకు గడువు పొడిగించే ప్రతిపాదనలను సమీక్షకు తీసుకొచ్చారు. పెండింగ్ దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారమైతే ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవాలని సీఎం సూచించారు.

మూడు బొగ్గు బ్లాకుల వేలంపై దృష్టి

రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరాను పటిష్టం చేసేందుకు ఏపీఎండీసీ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఒడిశా, ఝార్ఖండ్ రాష్ట్రాల్లోని మూడు బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొంటున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ మూడు బ్లాకుల్లో కలిపి 1,774.6 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు తెలిపారు. ఈ బ్లాకులు దక్కించుకోవడం ద్వారా రాష్ట్ర విద్యుత్ అవసరాలకు బొగ్గు సరఫరాను మెరుగుపరచడంతో పాటు ఇంధన భద్రతకు బలం చేకూరుతుందని వివరించారు.

ఖనిజ సంపదే రాష్ట్రాభివృద్ధికి కీలకం

రాష్ట్రంలో విస్తారంగా ఉన్న ఖనిజ వనరులను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి కొత్త అవకాశాలు సృష్టించాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీఎండీసీని జాతీయ స్థాయిలో పోటీపడగల సంస్థగా తీర్చిదిద్దడంతో పాటు ఖనిజ రంగంలో పెట్టుబడులు, ఆధునిక సాంకేతికత, ఉపాధి అవకాశాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

విమానాశ్రయ తరహాలో ఎయిర్ కాన్‌కోర్స్

-మొదటిపేజీ తరువాయి



అనుమతులు లభించడంతో రైల్వే బోర్డు స్టేషన్ కాంప్లెక్స్‌కు సంబంధించిన నిర్మాణ నమూనాలను సవరించింది. ఈ విషయాలను విశాఖ ఎంపీ శ్రీ భరత్ వెల్లడించారు. ఈ ఆధునికీకరణ ప్రాజెక్టులో ప్రధాన ఆకర్షణగా 72 మీటర్ల వెడల్పుతో భారీ ఎయిర్ కాన్‌కోర్స్ నిర్మించనున్నారు. స్టేషన్‌కు ఇరువైపులా ఉండే భవనాలను అనుసంధానిస్తూ విమానాశ్రయ టెర్మినల్ తరహాలో దీనిని రూపొందిస్తున్నారు. ఇందులో ఒకేసారి సుమారు 4,000 మంది ప్రయాణికులు ఉండేందుకు వీలుంటుంది. రైళ్ల కోసం వేచి ఉండే ప్రయాణికులకు విశాలమైన స్థలం, మెరుగైన రాకపోకల సదుపాయాలు కల్పించనున్నారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్మాణాన్ని చేపడుతున్నారు.

14 ప్లాట్‌ఫారాలతో భారీ విస్తరణ

ప్రస్తుతం ఉన్న 8 ప్లాట్‌ఫారాలను 14కు పెంచడంతో స్టేషన్ నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడనుంది. ప్లాట్‌ఫారాల విస్తరణకు అనుగుణంగా ప్రధాన స్టేషన్ భవనం, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, ఇతర నిర్మాణాల నమూనాలను రైల్వే బోర్డు సవరించింది. జ్ఞానాపురం వైపు, ప్లాట్‌ఫారమ్ నంబర్ 1 సమీపంలో నిర్మించనున్న ప్రధాన స్టేషన్ భవనాల డిజైన్లను కూడా మార్చారు. ఈ విస్తరణ పూర్తయితే ప్రయాణికుల రద్దీని సమర్థంగా నిర్వహించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

450 కార్లు.. 2 వేల ద్విచక్ర వాహనాలకు పార్కింగ్

స్టేషన్‌కు వచ్చే ప్రయాణికులు, వారిని తీసుకువచ్చే వాహనదారుల కోసం పార్కింగ్ సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా 450 కార్లు, 2,000 ద్విచక్ర వాహనాలను నిలిపేందుకు వీలుగా పార్కింగ్ ప్రాంతాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రయాణికులు స్టేషన్‌లోకి ప్రవేశించడం, బయటకు వెళ్లడం సులభతరం చేసేలా ప్రత్యేక మార్గాలను కూడా అభివృద్ధి చేస్తున్నారు.

ఫుడ్ కోర్టులు.. ఏసీ లాంజ్‌లు

ప్రయాణికులకు మెరుగైన అనుభూతిని కల్పించేందుకు స్టేషన్ ప్రాంగణంలో ఫుడ్ కోర్టులు, రిటైల్ అవుట్‌లెట్లు, ప్రత్యేక ఏసీ లాంజ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఆధునిక విశ్రాంతి గదులు, ప్రయాణికులకు అవసరమైన ఇతర వాణిజ్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. మొత్తం 60 ఎకరాల స్టేషన్ ప్రాంగణంలో వర్షపు నీటి సేకరణ వ్యవస్థ, మురుగునీటి శుద్ధి కేంద్రాలను కూడా నిర్మించనున్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు.

రెండు ట్రాక్‌లు నాలుగుకు విస్తరణ

విశాఖ రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకలను మరింత వేగవంతం చేసేందుకు అనుబంధ రైల్వే మార్గాల విస్తరణపైనా దృష్టి పెట్టారు. గోపాలపట్నం నుంచి విశాఖపట్నం వరకు ప్రస్తుతం ఉన్న రెండు ట్రాక్‌ల మార్గాన్ని నాలుగు ట్రాక్‌లుగా విస్తరిస్తున్నారు. దీంతో రైళ్ల రాకపోకలకు ఎదురయ్యే ఇబ్బందులు, ఆలస్యాలను తగ్గించే అవకాశం ఉంటుంది. అదనంగా సింహాచలం మీదుగా వెళ్లే బైపాస్ రైల్వే లైన్ పనులు కూడా వేగంగా కొనసాగుతున్నాయి.

2027 డిసెంబర్‌కు తొలి దశ పూర్తి

ఈ భారీ ప్రాజెక్టును దశలవారీగా పూర్తి చేయాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి దశ పనులను వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. మొత్తం ఆధునికీకరణ ప్రాజెక్టును 2028 డిసెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని ప్రణాళిక రూపొందించారు. సవరించిన నిర్మాణ నమూనాలను గురువారం ఆవిష్కరించారు.

పనుల పురోగతిని పరిశీలించిన ఎంపీ

విశాఖ ఎంపీ శ్రీ భరత్ రైల్వే అధికారులతో కలిసి స్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించి పనుల పురోగతి, నిర్మాణాల నమూనాలు, భవిష్యత్ అవసరాలపై చర్చించారు. రైల్వే చీఫ్ ఇంజినీర్ (నిర్మాణ విభాగం) విష్ణుమూర్తి ప్రాజెక్టు వివరాలను ఎంపీకి వివరించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మౌలిక సదుపాయాలను విస్తరిస్తున్నామని, నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులు తెలిపారు.

బిజీబిజీగా మేయర్ రెడ్డి అప్పలనాయుడు క్యాంపు కార్యాలయం..

మేయర్ రెడ్డి అప్పలనాయుడు అభినందనల వెల్లువ.. నగర ప్రముఖుల ఘన సత్కారం..

జనసేన కార్యాలయానికి పోటెత్తిన కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు..





ఏలూరు, నవంబర్ 20:- ఏలూరు నగర మేయర్ గా ఎన్నికైన జనసేన పార్టీ ఏలూరు నియోజకవర్గం ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మేయర్ గా ఎన్నికైన నేపథ్యంలో నగరంలోని పలువురు ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కూటమి పార్టీల శ్రేణులు, ఏలూరు నగర ప్రజలు రెడ్డి అప్పల నాయుడు నివాసంలో, జనసేన పార్టీ కార్యాలయంలో రెడ్డి అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.. ఏలూరు నగర పాలకసంస్థ నూతన మేయర్ గా బాధ్యతలు చేపట్టనున్న ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ నగర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని వారు ఆకాక్షించారు.. ఈ సందర్భంగా జనసేన పార్టీ కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొంది.. వివిధ వర్గాలకు చెందిన కూటమి నాయకులు, రెడ్డి అప్పలనాయుడు అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ నాయకుడు పట్ల తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. మేయర్ గా ఎన్నికైన సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ తనపైన ఎనలేని నమ్మకం, అభిమానం చూపిస్తూ శుభాకాంక్షలు తెలిపిన ప్రతిఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.. ఏలూరు నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ నగర అభివృద్ధికి అందరిని కలుపుకొని ముందుకు సాగుతానని ఆయన పేర్కొన్నారు.. తనపై ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు..

జిల్లా పరిషత్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గిడ్డి





పి గన్నవరం, నవంబర్ 20 (మీవార్త ప్రతినిధి నవీన్) అమలాపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా శ్రీమతి గొల్లపల్లి అమూల్యని, వైస్ చైర్మన్‌గా యెలిశెట్టి రామకృష్ణ ని జడ్పీటీసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అభినందనలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి లభించిన మద్దతుకు నిదర్శనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మొత్తం 19 జడ్పీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించారని పేర్కొన్నారు. నూతన పాలకవర్గం జిల్లా అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని ఆకాంక్షించారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో పాటు నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులందరికీ మరోసారి శుభాకాంక్షలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు, ఇన్చార్జులు శాసనసభ్యులు, నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులు, కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పాలకవర్గాలకు శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్.

ఏలూరు జడ్పీ చైర్ పర్సన్ నవ్యశ్రీకి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ శుభాకాంక్షలు.

మండలాల్లో ఎంపీపీలుగా, సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన నేతలకు కూడా శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ.

జిల్లా అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపిన ఎంపీ.







?ఏలూరు, నవంబర్ 20: పెదవేగి మండల జడ్పిటిసిగా ఏకగ్రీవంగా ఎన్నికై, ఏలూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ గా ప్రమాణ స్వీకారం చేసిన చింతమనేని సాయి నవ్యశ్రీకి, వైస్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన బొర్రా చలమయ్యకి, జడ్పీటీసీ సభ్యులందరికీ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఎంపీ శుక్రవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. అదే విధంగా జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపీపీలుగా, వైస్ ఎంపీపీలుగా, ఎంపిటిసి సభ్యులుగా ప్రమాణ శ్రీకారం చేసిన నేతలందరికీ కూడా ఎంపీ పుట్టా మహేష్ కుమార్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పదవులు అధిష్టించిన నేతలందరూ సేవాభావంతో ఉంటూ, జిల్లా అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని ఆకాంక్షిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ తన ప్రకటనలో వెల్లడించారు.

జడ్పీ చైర్మన్ కు అభినందనలు తెలిపిన "పోట్ల "

పుల్లలచెరువు, నవంబర్ 20 (మీ వార్త) మార్కాపురం జిల్లా తొలి జిల్లా పరిషత్ చైర్మన్ గా తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికైన కందుల రామిరెడ్డి ని మండల టిడిపి కన్వీనర్ పోట్ల గోవిందు శుక్రవారం నాడు అభినందనలు తెలిపారు. మార్కాపురం జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటి జిల్లా పరిషత్ చైర్మన్ గా ఎన్నికైనందున జిల్లా అభివృద్ధిలో నూతన ఒరవడి సృష్టించాలని, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ గా ఎన్నికైన శ్రీనివాస్ వర్మను కలిసి అభినందనలు తెలిపారు. జిల్లా పరిషత్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్ లకు అభినందనలు తెలిపిన వారిలో మండల పరిషత్ అధ్యక్షులు కాకర్ల వరలక్ష్మి కోటయ్య, టిడిపి మండల మాజీ కన్వీనర్ పల్లపాటి బాదరయ్య, టిడిపి సీనియర్ నాయకులు ఉప్పల హనుమంతరావు, సిద్దెనపాలెం సుబ్బారావు, తదితరులు ఉన్నారు.



జనరల్ స్థానంలో సర్పంచ్ అభ్యర్థికి పోటీపడుతున్న ఎస్సీ అభ్యర్థులకు మద్దతుగా నిలవడం మనందరి బాధ్యత--- దళిత చైతన్య వేదిక

రాజోలు నవంబర్ 20 (మీ వార్త విలేఖరి రవి) జనరల్ స్థానంలో సర్పంచ్ పదవికి ఎస్సీ సామాజిక వర్గం నుండి పదవికి పోటీపడుతున్న ఎస్సీ సర్పంచ్ అభ్యర్థికి ఆ గ్రామంలోనున్న ఎస్సీలందరూ వాళ్ళ వాళ్ళ ఇగోలను పక్కన పెట్టి మద్దత్తుగా నిలవాలని దళిత చైతన్య వేదిక నుండి సవినయంగా మనవి చేస్తున్నాము. వ్యక్తిగత ప్రయోజనాల కంటే జాతి ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన విషయాన్ని ఎవ్వరూ మరువకూడదు. జనరల్ కాబడిన స్థానంలో నిమ్నవర్గాలు (షెడ్యూల్డు కులాలు) పోటీ చేసి గెలవాలని బాబాసాహెబ్ అంబేద్కర్ వారు చెప్పిన విషయాన్ని ప్రతీ దళితుడు గుర్తెరగాలి. జనరల్ స్థానంలో ఎస్సీ అభ్యర్థి పోటీ చేస్తే మద్దత్తు ఇవ్వకుండా ఆధిపత్య వర్గాల వ్యక్తులకు మద్దత్తునిచ్చే దళితులను జాతిద్రోహులుగా గుర్తించాల్సిందే. మిత్రుల్లారా సర్పంచ్ ఎన్నికల్లో జనరల్ స్థానంలో పోటీచేసే మన ఎస్సీ వ్యక్తులకు మద్దత్తు ఇవ్వండి. ఎస్సీయేతరుల పంచన చేరి జాతిని వంచించే జాతిద్రోహులుగా మిగిలిపోకండి.. మీకు రెండు చేతులెత్తి దళిత చైతన్య వేదిక సవినయంగా విజ్ఞప్తి చేస్తుంది.

ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థిగా కేదాసి సత్యనారాయణ (చిన్న)నామినేషన్



పి గన్నవరం మీవార్త ప్రతినిధి (నవీన్):- గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని నరేంద్రపురం సర్పంచ్ అభ్యర్థిగా కేదాసి సత్యనారాయణ (చిన్న)నామినేషన్ దాఖలు చేశారు. తన స్వగృహం నుంచి అభిమానులు, కార్యకర్తలు, మద్దతుదారులతో కలిసి కాలినడకన పంచాయతీ వద్దకు చేరుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రంలో ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు సమర్పించారు ఈ సందర్భంగా చిన్న మాట్లాడుతూ గ్రామ ప్రజలు తనకు ఒక అవకాశం కల్పించి ఆశీర్వదించాలని కోరారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మౌలిక వసతుల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, రహదారుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు

24న శ్రీగౌతమేశ్వర స్వామి ఆలయంలో ఏకహశీ

అమలాపురం, మీ వార్త ప్రతినిధి, నవంబర్, 20 బోడసకుర్రు శ్రీ గౌతమేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా 6వఏకాహం భజన గురువులు కలిగినీడి సత్యనారాయణ పర్యవేక్షణలో,భక్తులు ధన సహాయంతో ఏకా హ కమిటీ ఆధ్వర్యంలో జరుగును.కార్యక్రమం లో భాగంగా ఉదయం ్లశస్థాపన,కంకణదారణ,అఖండ దీపారాధనకలిగి నీడి శ్రీనివాస రావు దంపతులు. సాయంత్రం 6గంటలకు ఆలయం వద్ద భక్తులు దీపాలు వెలిగించేకార్యక్రమం. అమ్మవారి గాజులు, విద్యార్థులకు పెన్నులు పంచి పెట్టడం. ఏకాహం కు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనసదుపాయాలు కడలి సాధు, షామియానాలు, టెంట్లు కుర్చీలు బండారు శ్రీనివాసరావు, లైటింగ్ మరియు సౌండ్ సిస్టమ్ కడలి శ్రీను,ఏర్పాటు చేస్తున్నారు.



రామన్నపేట పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పి ఏ సి ఎస్ చైర్మన్ మురాల ధనుష్

గూడూరు నవంబర్ 20(మీ వార్త ప్రతినిధి) రామన్నపేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంఘ అధ్యక్షుడు మురాల దనేష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం గ్రేడ్-ఏ రకం ధాన్యం 100 కిలోలకు రూ.2,461, సాధారణ రకం ధాన్యం 100 కిలోలకు రూ.2,441 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



గూడూరు లో 59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

గూడూరు నవంబర్ 20(మీ వార్త ప్రతినిధి) 59 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ 20.11.2026 శుక్రవారం ఉదయం గూడూరు గ్రంథాలయ ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం కి ముఖ్య అతిథిగా గ్రంథాలయ స్థల దాత శ్రీ అన్నం హరి రామకృష్ణ విచ్చేసిరి.సభాధ్యక్షులు గా శ్రీ ఆర్. భవన్నారాయణ వ్యవహరిశేచగా అతిథులుగా శ్రీమతి విజయ కుమారి ప్రధానోపాధ్యాయులు, జిల్లా పరిషత్ స్కూల్, శ్రీమతి భారతి ప్రధానోపాధ్యాయులు , ఎం పి పి స్కూల్ మరియు విశిష్ట అతిథిగా శ్రీ టి.వి. నరసింహాచార్యులు (మంగన్న మాస్టర్) ,శ్రీ పి. శ్రీనివాసరావు హాజరయ్యారు. వక్తలు గ్రంథాలయ ఆవశ్యకతను వివరించారు. అనంతరం శ్రీ అన్నం హరి రామకృష్ణ ని సన్మానించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయ అధికారి డి వి. నాగ రవి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీమతి డి. వెంకట రమణ, పాఠకులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



కృష్ణాజిల్లా పరిషత్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక ఏకగ్రీవం

చైర్ పర్సన్ గా భోగాది రమాదేవి (బిజేపీ),

వైస్ చైర్ పర్సన్ గా దండమూడి పూజిత ఎన్నిక

మచిలీపట్నం నవంబర్ 20(మీ వార్త ప్రతినిధి) చైర్ పర్సన్ గా భోగాది రమాదేవి పేరును ప్రతిపాదించిన పమిడిముక్కల జడ్పీటీసీ తాతినేని ప్రవళి బలపర్చిన ఘంటసాల జడ్పీటీసీ దోవారి పార్వతి వైస్ చైర్ పర్సన్ గా కంకిపాడు జడ్పీటీసీ దండమూడి పూజిత పేరును ప్రతిపాదించిన మచిలీపట్నం సౌత్ జడ్పీటీసీ కాగిత వెంకటేశ్వరరావు బలపర్చిన గుడ్లవల్లేరు జడ్పీటీసీ వర్రే బలరాం,ఇతర ప్రతిపాదనలు లేకపోవటంతో వీరి ఇరువురు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించిన కలెక్టర్ డీకే బాలాజీ,ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పెడన శాసనసభ్యులు శ్రీ కాగిత కృష్ణ ప్రసాద్ , గుడివాడ ఎమ్మెల్యే శ్రీ వెనిగండ్ల రాము పామర్రు ఎమ్మెల్యే శ్రీ వర్ల కుమార్ రాజా , మరియు కృష్ణాజిల్లా టిడిపి అధ్యక్షులు శ్రీ వీరంకి వెంకట గురుమూర్తి జనరల్ సెక్రెటరీ శ్రీ గోపు సత్యనారాయణ, గూడూరు జడ్పీటీసీ చోడగం నాంచారమ్మ సత్కరించినగుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల



రాము, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ బీజేపీ జనసేన నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది.

పాయకరావుపేటలో ఘనంగా ముగిసిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

పాయకరావుపేట, నవంబరు 20 , మీ వార్త ప్రతినిధి,పాయకరావుపేట శాఖా గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ నెల 14 నుంచి 20 వరకు వారం రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి జి రమేష్ బాబు, గౌరవ అతిథిగా కంభంపాటి వెంకట రమణ పాల్గొనగా సభాధ్యక్షులుగా విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఆర్ వి రత్నం వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రమేష్ బాబు మాట్లాడుతూ... ప్రస్తుతం పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతమైన ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని, పుస్తక పఠనం ద్వారా విద్యార్థులకు సంపూర్ణ జ్ఞానం లభిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం కేటాయించి గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవాలని, కనీసం ఆదివారమైనా గంటసేపు పఠనానికి కేటాయించాలని సూచించారు. సభాధ్యక్షులు రత్నం





మాస్టారు మాట్లాడుతూ... విద్యార్థులు మాతృ భాషపై పట్టు పెంచుకోవాలని, తెలుగు భాషలో మాట్లాడటంతో పాటు పద్య పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. గతంలో పుస్తకాలు అందుబాటులోలేక, గ్రంథాలయాలకు వెళ్లేందుకు కూడా ఎంతో దూరం నడవాల్సి వచ్చేదని గుర్తుచేశారు. నేడు అందరికీ ఉపయోగపడేలా సకల సౌకర్యాలతో శాఖా గ్రంథాలయం అందుబాటులో ఉందని తెలిపారు. వారోత్సవాల పోటీలను సమర్థవంతంగా నిర్వహించిన గ్రంథాలయ సహాయ అధికారను అభినందించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వారోత్సవాల నిర్వహణకు సహకరించిన గ్రంథాలయ సభ్యులతో పాటు, ప్రతిరోజూ గ్రంథాలయానికి వస్తూ పఠనాన్ని కొనసాగిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు తేజోమూర్తుల వెంకటేశ్వరరావును అతిథులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు ఎ శ్రీనివాసరాజు, ఎస్. సీతారామమూర్తి, ఎన్.టి. సీతారామమూర్తి, ప్రభుత్వ బాలికల పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, గ్రంథాలయ సంస్థ సభ్యులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతి హత్య కేసులో నిందితులు అరెస్టు.



అరకు వేలి ఫిబ్రవరి 20 మీ వార్తా న్యూస్,,,అరకులోయ మండలంలో సంచలనం సృష్టించిన యువతి హత్య కేసును పోలీసులు కేవలం రెండు రోజుల్లోనే ఛేదించారు.ప్రధాన నిందితుడితో పాటు హత్యకు సహకరించిన మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పాడేరు ఎస్‌డీపీఓ రాజసింహారెడ్డి వెల్లడించారు.అనంతరం ఎస్‌డీపీఓ మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ ఉదయం సుమారు 8.30 గంటలకు అరకు వ్యాలి మండలం, చొంపి బ్రిడ్జి గెడ్డ వద్ద కిల్లో మీనాక్షి (19) అనే యువతి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. దీనిపై అరకు వ్యాలి పోలీస్ స్టేషన్‌లో జతీ.చీశీ.56/2026, సెక్షన్ 103(1) దీఓూ కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.
హత్యకు దారితీసిన కారణాలు:
మృతురాలు మీనాక్షి అరకు ప్రభుత్వ ఆర్.ఐటీఐ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ మెకానిక్ మొదటి సంవత్సరం చదువుతుండగా, అదే కళాశాలలో డీజిల్ మెకానిక్ చదువుతున్న తామర్ల పవన్ కుమార్ (19)తో ప్రేమలో పడింది. మీనాక్షి అరకు ఎన్టీఆర్ గ్రౌండ్స్ సమీపంలో ఓ గది అద్దెకు తీసుకుని నివసిస్తోంది. తనను వివాహం చేసుకోవాలని పవన్‌ను మీనాక్షి ప్రతిరోజూ కోరడంతో ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి.ఈ విషయాన్ని పవన్ తన స్నేహితులైన పాంగి త్రినాథ్ అలాగే మైనార్ బాలుడుకు తెలిపాడు. ఈ క్రమంలో 17వ తేదీ ఉదయం మీనాక్షి ఫోన్ చేసి, తమ ప్రేమ విషయం కళాశాలలో అందరికీ తెలిసిపోయిందని చెప్పడంతో మరోసారి గొడవ జరిగింది.దీంతో మీనాక్షిని హత్య చేయాలని పవన్ నిర్ణయించుకుని, అదే రోజు మధ్యాహ్నం తన స్నేహితులకు చెప్పగా వారు కూడా అంగీకరించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది.ముందుగా వేసుకున్న పథకం ప్రకారం, 17వ తేదీ రాత్రి సుమారు 8 గంటలకు పవన్, మీనాక్షిని స్కూటీపై చొంపి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి దాడి చేసి గాయపరిచాడు. ఆ తర్వాత అక్కడికి చేరుకున్న మైనర్ బాలుడు, త్రినాథ్ సహాయంతో పవన్ ఆమెను బ్రిడ్జి కింద గెడ్డ ఒడ్డుకు తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి హత్య చేశాడు. అనంతరం దీనిని ఆత్మహత్యగా నమ్మించేందుకు మృతదేహాన్ని చోంపి గెడ్డ ఒడ్డున పడేసి వెళ్లారు.శాస్త్రీయ, సాంకేతిక ఆధారాల సేకరణలో భాగంగా నిందితులు మరియు మృతురాలి కాల్ డేటా రికార్డ్స్ (సిడిఆర్)ను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీటీవీ ఫుటేజీలను సేకరించి, డాగ్ స్క్వాడ్ సహాయంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపిన పోలీసులు, ప్రధాన నిందితుడు తామర్ల పవన్ కుమార్‌తో పాటు సహచరులు పొంగి త్రినాథ్, మైనర్ బాలుడును రెండు రోజుల్లోనే అదుపులోకి తీసుకున్నారు.కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన అరకు సీఐ ఏ. కోటేశ్వరరావు, అరకు ఎస్సై టీ. మల్లేశ్వరరావు అలాగే పోలీసు సిబ్బందిని పాడేరు ఎస్‌డీపీఓ రాజసింహారెడ్డి, ఉన్నత అధికారులు అభినందించారు.

ఎండపల్లి గ్రామ మహా కూటమి సర్పంచ్ అభ్యర్థిని పిన్నింటి రాజ్యలక్ష్మి రత్తయ్య.



కృత్తివెన్ను నవంబర్ 20 (మీ వార్తా ప్రతినిధి) కృత్తివెన్నుమండలంలోని యండపల్లి గ్రామ పంచాయతీ కీ జరగనున్న సర్పంచ్ ఎన్నికలలో మహా కూటమి బలపరిచిన అభ్యర్థిగా పిన్నింటి రాజ్యలక్ష్మి రత్తయ్యను పెడన శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ఖరారు చేశారు. సుదీర్ఘకాలం తెలుగుదేశం పార్టీ కార్యకర్తగా, మండల కార్యదర్శి గా, క్లస్టర్ ఇంచార్జ్ గా పనిచేసిన పిన్నింటి రత్నారావు (రత్తయ్య) సతీమణి రాజ్యలక్ష్మి కీ గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం యివ్వడం పట్ల గ్రామంలోని మహా కూటమి శ్రేణులు అందరు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థిని పిన్నింటి రాజ్యలక్ష్మి రత్తయ్య మాట్లాడుతూ ఎంపీ వల్లభనేని బాల సౌరీ, శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్, ఎంపీపీ నడకుదిటి వెంకటేశ్వరమ్మ, జడ్పీటీసీ గరికపాటి శ్రీ లత ల సహాయ సహకారాలతో గ్రామంలో ప్రతి సమస్య పరిస్కారం చేస్తానని, యిప్పటికే గ్రామంలో రోడ్లు, డ్రైన్లు, స్మశాన వాటిక మరమ్మత్తులు వంటి సమస్యలు గ్రామస్తులు తన దృష్టిలో పెట్టారు అని సర్పంచ్ అయిన మొదటి మూడు నెలల్లోనే వీటికి పరిస్కారం చూపి, గ్రామ అభివృద్ధి పై దృష్టి పెడతాను అని పిన్నింటి రాజ్యలక్ష్మి రత్తయ్య అన్నారు. తమ నామినేషన్ కార్యక్రమం ఆదివారం 11: 30 నిమిషాలకు జరుగుతుంది అని యండపల్లి, గాంధీ నగర్ ప్రజలకు, కృత్తివెన్ను మండల మహా కూటమి నాయకులకు స్వాగతం పలుకుతున్నామని పిన్నింటి రాజ్యలక్ష్మి రత్తయ్య తెలిపారు....

తెదేపా నాయకుడి మృతి తీరని లోటు



జి మాడుగుల (మీ వార్త ప్రతినిధి) జి.మాడుగుల మండలం కోరాపల్లి గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు, ఆర్ఎంపీ వైద్యుడు వాళంగి రమణమూర్తి ,అకాల మరణం పార్టీకి తీరని లోటని నూతన ఎంపీపీ గబ్బాడి శాంతికుమారి అన్నారు. శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీ కిడారి రమేష్‌బాబు, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కొఠారి చిన్నకొండబాబు, కూటమి నాయకులు శ్రీను, జర్ర అంకిత్, భీమ్‌బాబు, కుడుముల సత్యనారాయణ, సింహాచలం, దేవయ్య, కే.కొండబాబు, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, కె.చిట్టినాయుడు, ఎల్.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవం గా కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినం





పుల్లలచెరువు, నవంబర్ 20 (మీ వార్త) మండల కేంద్రమైన పుల్లలచెరువు గ్రామంలోని శ్రీ భవాని శంకర స్వామి వారి దేవాలయంలో శుక్రవారం కార్తీక శుద్ధ ఏకాదశి పర్వదినం వైభవంగా నిర్వహించారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారికి ప్రాతఃకాలం నుండి విశేషమైనటువంటి అభిషేక పూజా కార్యక్రమాలు, బిల్వార్చన కార్యక్రమాలు అత్యంత వైభవో పేతంగా నిర్వహించారు. భక్తులు ప్రాతఃకాలము సమయము నుంచే ఆలయానికి చేరుకుని కార్తీక దీపాలు వెలిగించారు. స్వామివారి అభిషేకానికి క్యూలైన్ లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని అభిషేకించుకొని ఓం నమశ్శివాయ అంటూ ఆలయమంతా కూడా మారు మోగింది వచ్చినటువంటి భక్తులందరికీ కూడా ఆలయ సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీర్థ ప్రసాద పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులంతా కూడా శ్రీ భవాని శంకర స్వామి వారిని దర్శించుకుని తన్మయత్వం పొందారు.

జి. మాడుగుల సర్పంచ్ అభ్యర్థిగా

త్రివేణి భారతి నామినేషన్ దాఖలు

14 వార్డు సభ్యులతో కలిసి భారీ ఊరేగింపు

కోలాహలంగా సాగిన నామినేషన్ ప్రక్రియ





జి. మాడుగుల,(మీ వార్త ప్రతినిధి) జి. మాడుగుల గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి మత్యరాస త్రివేణి భారతి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక ఎన్నికల అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి ఆమె తన నామినేషన్ పత్రాలను అందజేశారు. ?నామినేషన్ దాఖలు చేసేందుకు ముందుగా ఆమె తన మద్దతుదారులు, గ్రామస్తులతో కలిసి భారీ ఊరేగింపుగా పంచాయతీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. సర్పంచ్ అభ్యర్థి త్రివేణి భారతితో పాటు 14 మంది వార్డు సభ్యులు కూడా ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేశారు.?ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావడంతో నామినేషన్ ప్రక్రియ కోలాహలంగా సాగింది. ప్రజాదరణ, మద్దతుదారుల ఉత్సాహం చూస్తుంటే ఈ ఎన్నికల్లో త్రివేణి భారతి గెలుపు తథ్యమని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అప్స రాష్ట్ర కన్వీనర్ గా వి. నాగప్రవీణ్ ఎన్నిక



పెడన నవంబర్ 20(మీ వార్త ప్రతినిధి) అప్స రాష్ట్ర కన్వీనర్ గా వి. నాగప్రవీణ్ ను స్థానిక విశ్వభారతి హై స్కూల్, పెడన నందు ఎ.పి ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కృష్ణాజిల్లా అధ్యక్షులు కె.వి. జాన్ అధ్యక్షతన జరిగిన గవర్నింగ్ బాడీ సమావేశంలో ఎన్నుకున్నారు. వీరితోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సాబూ జాన్ (సెయింట్ జాన్స్ హై స్కూల్, బంటుమిల్లి) రాష్ట్ర స్పెల్ బీ చైర్మన్ గా వి.డి.ఎస్. ప్రసాద్ (సాయి గీతాంజలి హై స్కూల్, హనుమాన్ జంక్షన్) రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా అజ్మతుల్లాఖాన్ (చిన్నారి హై స్కూల్, నందమూరు)ను ఎన్నుకున్నారు. వీరందరూ ఆదివారం విజయవాడలో జరిగే రాష్ట్ర మహాసభలో ప్రమాణ స్వీకారం చేస్తారని జిల్లా అధ్యక్షులు కె.వి.జాన్ తెలియజేశారు. ఎన్నికైన సభ్యులు రాష్ట్రంలోని ప్రైవేట్ విద్యాసంస్థల ఉన్నతికి కృషి చేయాలని సమావేశంలోని కార్యవర్గ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో అప్స రాష్ట్ర, జిల్లా నాయకులు ఎ .గౌరీ ప్రసాద్, కె. నాగ మోహనరావు, కె.దిలీప్ కుమార్, కె.డి.యన్.వి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి భరోసా...ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం...

అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

సుందరగిరిలో పథకాన్ని ఘనంగా ప్రారంభించిన ప్రజాప్రతినిధులు.కాంగ్రెస్ నేతలు



చిగురుమామిడి నవంబర్ 20(మీ వార్త విలేకరి సొన్నాయిల భరత్): నిరుపేద,మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సుందరగిరి గ్రామంలో ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి,గ్రామ సర్పంచ్ జంగ శిరీష వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందే సురేష్,డీసీసీ జిల్లా కార్యదర్శి సాంబారి బాబు పాలకవర్గ సభ్యులతో కలిసి ఈ పథకాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ తిరుపతి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని,అనుకోని ఆపద సమయంలో కుటుంబాలకు అండగా నిలిచేందుకే ఈ జీవిత బీమా పథకాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబం ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. పథకం అమలులో అధికారులు, స్థానిక నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి పూర్తి సహకారం అందిస్తారని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెడబోయిన రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి గొల్లేని సంపత్,కాంగ్రెస్ పార్టీ డిసిసి కార్యదర్శి సాంబారి బాబు,వార్డు సభ్యుడు గిరబోయిన రవీందర్,శ్రీమూర్తి శ్రీనివాస్,వంతడుపుల దిలీప్ కుమార్, నాయకులు పెసరి శ్రీనివాస్,గుడిసె మల్లికార్జున్, కూరెళ్ళ కిషోర్, తదితరులు పాల్గొన్నారు..

బ్యాంక్ ఆఫ్ అమెరికాకు హైదరాబాద్‌లో 8.28 కోట్ల అద్దె

హైదనాబాద్ : హైదరాబాద్ మహానగరం మరోసారి తన సత్తా చాటింది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు గమ్యస్థానంగా మారింది. ప్రపంచ బ్యాంకింగ్ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ అమెరికా తమ భారత అనుబంధ సంస్థ బీఏ కంటిన్యూమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా హైదరాబాద్ మాదాపూర్‌లోని మైండ్ స్పేస్ సైబరాబాద్లో ఏకంగా 10,10,467 చదరపు అడుగులు 1 మిలియన్ స్క్వేర్ ఫీట్ కంటే ఎక్కువ) ఆఫీసు స్థలాన్ని లీజుకు తీసుకుంది. కె.రహేజా ఐటీ పార్క్ (మైండ్ స్పేస్ బిజినెస్ పార్క్) ఖీఇఎ)కు చెందిన బిల్డింగ్ నంబర్-1 గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు 11 అంతస్తులు అంటే మొత్తం 12 ఫ్లోర్లను 12 సంవత్సరాల కాలానికి లీజుకు తీసుకుంది. ఈ ఒప్పందం విలువ అద్దె రూపంలోనే సుమారు రూ.1450 కోట్ల నుంచి రూ.1500 కోట్ల వరకు ఉంటుందని ప్రాప్ స్టాక్ వెల్లడించింది. ఈ ఏడాది దేశంలో నమోదైన అతిపెద్ద ఆఫీస్ స్పేస్ లీజు ఒప్పందాల్లో ఒకటిగా నిలిచిన ఈ మెగా డీల్ పూర్తి వివరాలు తెలుసుకుందాం.రియల్ ఎస్టేట్ డేటా అనలిటిక్స్ సంస్థ ప్రాప్ స్టాక్ సెకరించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ప్రకారం మాదాపూర్ మైండ్ స్పేస్ సైబరాబాద్ బిల్డింగ్ నంబర్ 1లోని గ్రౌండ్ ప్లస్ 11 అంతస్తులలో మొత్తం 10,10,467 చదరపు అడుగుల ఛార్జబుల్ ఏరియా లీజుకు తీసుకున్నారు.ప్రతి చదరపు అడుగుకు నెలకు రూ.82 చొప్పున, ప్రారంభ నెలవారీ అద్దె రూ.8.28 కోట్లుగా, ఏడాదికి రూ.99.42 కోట్లుగా నిర్ణయించారు.

ఈ లీజు కోసం బ్యాంక్ ఆఫ్ అమెరికా ఇప్పటికే రూ.49.72 కోట్లను సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించింది. ఒప్పందం ప్రకారం ప్రతి 3 సంవత్సరాలకు ఒకసారి 15 శాతం చొప్పున అద్దె పెంచనున్నారు. దీని ప్రకారం 12 ఏళ్లలో మొత్తం అద్దె రూ.1,450 నుంచి రూ.1500 కోట్లుగా ఉండనుంది.ఈ లీజు ఒప్పందం సెప్టెంబర్ 7, 2026 నుంచి అధికారికంగా ప్రారంభం కాగా, రెంట్ ఫ్రీ పీరియడ్ తర్వాత జనవరి 2027 నుంచి నెలవారీ అద్దె చెల్లింపులు మొదలవుతాయి. భవిష్యత్తులో దశలవారీగా మరో 5 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని కూడా తీసుకునే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.2026లో దేశంలోని టాప్ ఆఫీస్ స్పేస్ లీజింగ్ ఒప్పందాల్లో హైదరాబాద్ అగ్రభాగన నిలుస్తోంది. ఇటీవల ఐటీ దిగ్గజం యాక్సెంచర్ హైదరాబాద్ హైటెక్ సిటీలో తమ జీసీసీ కోసం 10.17 లక్షల చదరపు అడుగుల ఆఫీస్ స్థలం లీజుకు తీసుకుంది. ఇప్పుడు బ్యాంక్ ఆఫ్ అమెరికా కుదుర్చుకున్న 10.10 లక్షల చదరపు అడుగుల ఒప్పందం హైదరాబాద్ వాణిజ్య రియల్ ఎస్టేట్ చరిత్రలోనే రెండో అతిపెద్ద డీల్‌గా నిలిచింది. నైట్ ఫ్రాంక్ గణాంకాల ప్రకారం, 2026 తొలి 9 నెలల్లో హైదరాబాద్‌లో 13.1 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ లీజింగ్ జరగగా అందులో 47 శాతం వాటా కేవలం జీసీసీలదే కావడం విశేషం.

ఐటీ ఉద్యోగులు, రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం10 లక్షల చదరపు అడుగులకు పైగా ఆఫీస్ స్పేస్‌లో సుమారు 10 వేల నుంచి 12 వేల మందికిపైగా టెక్నాలజీ, ఫైనాన్స్, రిస్క్ మేనేజ్మెంట్, డేటా అనలిటిక్స్ నిపుణులకు

పెంటపాడు మండల జడ్పీటీసీగా ప్రమాణ స్వీకారం చేసిన తనబుద్ధి రవికిరణ్



భీమవరం నవంబర్ 20 (మీ వార్త ప్రతినిధి) భీమవరంలో జరిగిన జడ్పిటిసిల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పెంటపాడు మండల జడ్పీటీసీ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేయడం ఎంతో ఆనందంగా, గర్వంగా భావిస్తున్నానని తనబుద్ధి రవికిరణ్ అన్నారు. శుక్రవారం భీమవరంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి, తనను ఆదరించి, అఖండ విజయాన్ని అందించిన పెంటపాడు మండల ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. పెంటపాడు మండలంలోని ప్రతి గ్రామ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి, యువతకు అవకాశాల కల్పనకు, మహిళల సంక్షేమానికి, రైతుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా హామీ ఇస్తున్నానని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ, ప్రజల గొంతుకగా, ప్రజల మనిషిగా పనిచేస్తానని అన్నారు. ఈ విజయానికి సహకరించిన గౌరవనీయులు ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, కూటమి కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు నా పెంటపాడు మండల ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

జీలుగుమిల్లి మండల జడ్పిటిసి గా కోర్స సూరమ్మ ప్రమాణస్వీకారం.





జీలుగుమిల్లి.(మీ వార్త ప్రతిని ధి) ఏలూరు జడ్పీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జడ్పిటిసి ల ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంలో జీలుగుమిల్లి మండలానికి చెందిన వైసిపి జడ్పిటిసికోర్స సూరమ్మ తో అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఆమె తెలిపారు. తన గెలుపుకు కృషి చేసిన నాయకులకు కార్యకర్తలకు ఆమె అభినందనలు తెలియజేశారు. మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. అనంతరం నూతన జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన చింతమనేని నవ్య శ్రీ ని కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోర్స వెంకటేశ్వరరావు . నాయకులు పాల్గొన్నారు.

శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో అన్నప్రసాద వితరణకు సహకరించిన దాతలు





గుడివాడ నవంబర్ 20(మీ వార్త ప్రతినిధి) కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈరోజు శుక్రవారం కావుట వలన అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు అన్నప్రసాద వితరణకు సహకరించిన దాతలు ఉయ్యూరు ఎస్సై వీర వెంకట సత్యనారాయణ శ్రీమతి పార్వతి వారి కుమారై చి×× సౌమ్య శ్రీ, కుమారుడు సత్య సాయి శివ తేజ కుటుంబ సభ్యులచే అన్న ప్రసాద వితరణ జగినది. దేవస్థాన చైర్మన్ శ్రీ ఈడే వెంకట విష్ణు మోహనరావు సభ్యులు శ్రీమతి తూము రాజ్యలక్ష్మి మరియు కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు పాల్గొనారు అని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు , ఒక ప్రకటనలో తెలియజేసినారు.

మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇళ్లపై ఈడీ మెరుపు దాడులు.. అరెస్ట్ చేసే అవకాశం

ఖానాపూర్, హైదరాబాద్‌లలో ఉదయం నుంచే ముమ్మరంగా సాగుతున్న తనిఖీలు

రూ.40.96 కోట్ల విలువైన సీఎంఆర్ ధాన్యం పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు

ఖానాపూర్ నివాసం వద్ద రేఖను అరెస్ట్ చేసే అవకాశం

నిర్మల్ : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్‌కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ ఉదయం ఖానాపూర్‌తో పాటు హైదరాబాద్‌లోని ఆమె నివాసాల్లో ఈడీ అధికారులు ఏకకాలంలో ముమ్మర సోదాలు చేపట్టారు. ఖానాపూర్ మండలం సత్తెనపల్లి వద్ద రేఖానాయక్‌కు చెందిన ఏఆర్ఎస్ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు ప్రభుత్వం మిల్లింగ్ నిమిత్తం ధాన్యాన్ని కేటాయించింది. అయితే, 2022-23, 2023-24, 2024-25 రబీ సీజన్లకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన ధాన్యంలో పెద్ద మొత్తంలో బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించకుండా పక్కదారి పట్టించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీని విలువ మార్కెట్‌లో సుమారు రూ.40.96 కోట్లు ఉంటుందని పౌరసరఫరాల శాఖ గుర్తించింది. గత ఆగస్టు నెలలో

టిడిపి సభ్యునికి ఆర్థిక సాయం



జంగారెడ్డిగూడెం, నవంబర్ 20 (మీ వార్త ప్రతినిధి) తెలుగుదేశం పార్టీ నాయకుడు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నారు వారిన బాధను గ్రహించి తానం సత్యనారాయణ ఆర్థిక సాయంగా కూటమి పార్టీ బలపరిచిన అభ్యర్థి నూనె వీరస్వామి వారికి 5,000 వేల రూపాయలు అలాగే 3 వార్డు అభ్యర్థి సుంకువల్లి అనిల్ 5, 000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఎవరు ఆపదలో ఉన్న మన కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేసారు ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

ఎట్టకేలకు గూడూరు వైస్ ఎంపీపీ పదవి జనసేన ఎంపిటిసి సమ్మెట లక్ష్మీ శైలజ



గూడూరు నవంబర్ 20(మీ వార్త ప్రతినిధి) జనసేన బలపరిచిన ముక్కొల్లు ఎంపీటీసీ అభ్యర్థి సమ్మెట లక్ష్మీ శైలజ గూడూరు వైస్ ఎంపీపీగా ప్రమాణస్వీకారం చేసినారు. గురువారం బి -ఫారం సమర్పించక పోవడంతో వాయిదా పడిన ఎన్నిక నేడు జరిగింది. ఈ సందర్భంగా జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన హర్రమ్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు లేళ్లగరువు మల్లవోలు గూడూరు పిఎసిఎస్ చైర్మన్లు , చీర్ల నవీన్ చీర సంతోష్, కమ్మిల శ్రీనివాసరావు, కమ్మిల సుబ్రమణ్యం, యార్లగడ్డ దుర్గాప్రసాద్, ప్రత్తిపాటి స్వామి తదితరులు పాల్గొన్నారు.

నామవరంలో "ధరణి రైస్ కౌంటర్" ప్రారంభించిన తహసీల్దారు మహేశ్వరరావు





పాయకరావుపేట, నవంబరు 20 , మీ వార్త ప్రతినిధి,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని నామవరంలో హైవే ప్రక్కన శుక్రవారం "ధరణి రైస్ కౌంటర్" ను తహసీల్దారు ఎస్ఎ మహేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దారు ఎం గణపతిరావు మాట్లాడుతూ... ఈ ధరణి కౌంటర్ ద్వారా నాణ్యమైన బియ్యం ప్రజలకు తక్కువ ధరకే అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఒక రైస్ కార్డుదారుడికి నెలకు 26 కేజీల బిపిటి రైస్ బ్యాగ్ 1,274 రూపాయలకే అందజేస్తామని తెలిపారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు డొంకాడ శాంతి భూషణరావు, ఆర్ఐ టి త్రినాథ్, నామవరం విఆర్ఓ తొమ్మండ్రు అప్పారావు, మాసాహేబుపేట విఆర్ఓ రాజాన వరహాలరావు, శ్రీరాంపురం విఆర్ఓ వి నూకరాజు, మండల రేషన్ డీలర్లు యూనియన్ ప్రెసిడెంట్ గంపల చిట్టిబాబు, గుంటపల్లి రేషన్ డీలర్ దమ్ము సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య పాఠశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల దినోత్సవ వేడుకలు



అమలాపురం, మీ వార్త ప్రతినిధి, నవంబర్, 20 ఆదిత్య పాఠశాల -గొల్ల గూడెం శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలల దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కిమ్స్ వైద్యురాలు కె.జ్ఞానేశ్వరి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బాల్యం అనేది జీవితంలోఎంతో అమూల్యమైనదవిద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం, పరిశుభత్ర, పోషకాహారం,ఐ క్రమశిక్షణ ల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆరోగ్యకరమైన అలవాట్లను చిన్ననాటి నుండి అలవరుచుకోవాలి.ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలి.ఈ సందర్భంగా పాఠశాలప్రధానోపాధ్యాయురాలు కె.లక్ష్మి దేవి మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్ పునాదులని, ప్రతి విద్యార్థి లోను ప్రత్యేకత వుంటుంద" అన్నారు. ప్రతి విద్యార్థి చదువు లోనే కాకమిగిలిన రంగాల్లో కూడారాణించాలన్నారు.అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు,పశ్రంసా పత్రాలు అందజేసారు. ఆదిత్య సంస్థలు చైర్మన్ ఎన్. శేషా రెడ్డి,డైరెక్టర్ శృతి రెడ్డి,డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ కె. లక్ష్మి దేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఫాల్గొన్నారు.

బంటుమిల్లి మండలంలో విశ్వహిందూ పరిషత్ హితచింతక్ అభియాన్‌పై సమావేశం

హిందూ సమాజ సంఘటిత శక్తి -- ధార్మిక చైతన్యం - సామాజిక సమరసతే లక్ష్యం

కృష్ణా జిల్లా, నవంబర్ 20(మీ వార్త ప్రతినిధి)
విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హితచింతక్ అభియాన్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో 2026 నవంబర్ 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు బంటుమిల్లి మండలంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశాన్ని కృష్ణా జిల్లా ప్రభారి శ్రీ పి.వి.ఎస్. రాయుడు గారు నిర్వహించారు.ఈ సందర్భంగా హితచింతక్ అభియాన్ యొక్క ప్రధాన ఉద్దేశాలు, హిందూ సమాజంలో సంఘటనా భావనను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత, గ్రామస్థాయిలో ధార్మిక మరియు సామాజిక కార్యక్రమాల విస్తరణపై చర్చించారు.
హితచింతక్ అభియాన్ అనేది కేవలం సభ్యత్వ నమోదు కార్యక్రమం మాత్రమే కాకుండా, హిందూ సమాజంలోని వివిధ వర్గాలు, వృత్తులు, ప్రాంతాలు మరియు తరాల ప్రజలను ఒకే సామాజిక, సాంస్కృతిక చైతన్యంతో అనుసంధానించే ఒక విస్తృతమైన సామాజిక కార్యక్రమం. హిందూ ధర్మంలోని విలువలు, భారతీయ



సంస్కృతి, సంప్రదాయాలు, కుటుంబ వ్యవస్థ, సేవాభావం మరియు సామాజిక బాధ్యతల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించడం దీని ముఖ్య ఉద్దేశ్యం.
ప్రస్తుత సమాజంలో యువతకు భారతీయ సంస్కృతి, ధార్మిక సంప్రదాయాలు, మన పండుగలు, దేవాలయాల ప్రాముఖ్యత మరియు మన వారసత్వం గురించి అవగాహన కల్పించడం ఎంతో అవసరం. అదే సమయంలో సమాజంలోని అన్ని వర్గాల మధ్య పరస్పర గౌరవం, ఐక్యత, సామాజిక సమరసతను పెంపొందించడం ద్వారా బలమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది.
గ్రామస్థాయిలో విశ్వహిందూ పరిషత్ కార్యకలాపాలను బలోపేతం చేయడం, స్థానికంగా ధార్మిక కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం, యువత మరియు మహిళలను సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం, అవసరమైన సందర్భాల్లో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలకు హితచింతక్ అభియాన్ ద్వారా ప్రాధాన్యత కల్పించాలని సమావేశంలో చర్చించారు.ఈ కార్యక్రమంలో శ్రీ ఏలూరి నాగబాబు (జిల్లా బీజేపీ కార్యదర్శి), శ్రీ బసవాని నీలజలం గారు (ధర్మ ప్రచార ప్రముఖ్), శ్రీమతి జన్యావుల ఝాన్సీ గారు (దుర్గావాహిని ప్రముఖ్), శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం గారు (కార్యాలయ ప్రముఖ్) పాల్గొన్నారు.హిందూ సమాజంలోని ప్రతి కుటుంబానికి, ప్రతి గ్రామానికి ధార్మిక చైతన్యం మరియు సేవాభావం చేరేలా సమిష్టి కృషి చేయాలని, వ్యక్తుల కంటే సంస్థాగత నిర్మాణానికి ప్రాధాన్యతనిస్తూ గ్రామస్థాయిలో బలమైన కార్యాచరణను రూపొందించుకోవాలని ఈ సమావేశం ద్వారా పిలుపునిచ్చారు.ధర్మ పరిరక్షణ -- సమాజ సంఘటన -- సేవా భావన -- సామాజిక సమరసత: హితచింతక్ అభియాన్ ప్రధాన ఆశయం.

ఎన్. గొల్లపాలెంలో భక్తిశ్రద్ధలతో రుద్రార్చన -- సింధూరార్చన

మహిళల భాగస్వామ్యంతో వైభవంగా ధార్మిక కార్యక్రమం

కృష్ణా జిల్లా, నవంబర్ 20(మీ వార్త ప్రతినిధి)
విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన ధార్మిక చైతన్య కార్యక్రమాల్లో భాగంగా నవంబర్ 20వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఎన్. గొల్లపాలెం గ్రామంలోని శ్రీ సరస్వతి రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి వారి ఆలయంలో రుద్రార్చన, సింధూరార్చన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశేషంగా 120మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని ప్రత్యేక పూజల్లో భాగస్వాములయ్యారు. మహిళల పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం గ్రామంలో ధార్మిక చైతన్యం, భక్తిభావం పట్ల ఉన్న ఆసక్తిని ప్రతిబింబించింది.
ఈ కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా కార్యాలయ ప్రముఖ్ శ్రీ జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం గారు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ మచిలీపట్నం ఖండ అధ్యక్షులు శ్రీ ఆడుసుమిల్లి శ్రీనివాసరావు గారు, ఆలయ పూజారి పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు.
ధార్మిక చైతన్యంతో పాటు మహిళా భాగస్వామ్యానికి ప్రాధాన్యత
విశ్వహిందూ పరిషత్ నిర్వహిస్తున్న రుద్రార్చన,



సింధూరార్చన, కుంకుమార్చన కార్యక్రమాలు కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, గ్రామీణ సమాజంలో ధార్మిక చైతన్యాన్ని పెంపొందించే కార్యక్రమాలుగా కొనసాగుతున్నాయి.
ముఖ్యంగా మహిళలను ధార్మిక, సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములను చేయడం, యువతలో సనాతన ధర్మ సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడం, గ్రామాల్లోని ఆలయాలను సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యాలు.
సామాజిక సమరసతే ప్రధాన లక్ష్యం
కుల, వర్గ భేదాలకు అతీతంగా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ధార్మిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం ద్వారా సామాజిక సమరసతను బలోపేతం చేయవచ్చని విశ్వహిందూ పరిషత్ భావిస్తోంది. పరస్పర గౌరవం, సోదరభావం, సమాజ శ్రేయస్సు వంటి విలువలను ప్రజల్లో పెంపొందించడం ద్వారా గ్రామస్థాయిలో ఐక్యతను సాధించవచ్చని నిర్వాహకులు తెలిపారు.గ్రామగ్రామాన ఇటువంటి కార్యక్రమాలను నిరంతరంగా నిర్వహిస్తూ, ధార్మిక చైతన్యంతో పాటు సామాజిక బాధ్యత, సేవాభావం, సమాజ సంఘటనను పెంపొందించేందుకు విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా శాఖ కృషి చేస్తోందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పాల్గొన్న 120 మంది మహిళలకు, ఆలయ పూజారికి, సహకరించిన గ్రామస్థులకు విశ్వహిందూ పరిషత్ కృష్ణా జిల్లా శాఖ కృతజ్ఞతలు తెలియజేసింది.డా. బూరగడ్డ శ్రీనాథ్
విశ్వహిందూ పరిషత్
కృష్ణా జిల్లా శాఖ

కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా భోగాది రమాదేవి, వైస్ చైర్‌పర్సన్‌గా దండమూడి పూజిత ఎన్నిక



ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజి

మచిలీపట్నం: నవంబరు 20(మీ వార్త ప్రతినిధి)
ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని పిలుపు కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా నాగాయలంక మండలం జెడ్పీటీసీ సభ్యురాలు భోగాది రమాదేవి, వైస్ చైర్‌పర్సన్‌గా కంకిపాడు మండలం జెడ్పీటీసీ సభ్యురాలు దండమూడి పూజిత ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజి నిర్వహించారు.జిల్లాలోని 26 మండలాల జెడ్పీటీసీ సభ్యులకు ఎన్నికల ప్రక్రియలో భాగంగా సమావేశానికి ఆహ్వానం పలికి ప్రమాణ స్వీకారం చేయించారు. కోడూరు మండల జెడ్పీటీసీ సభ్యురాలు బొలిశెట్టి అరుణశ్రీ మినహా మిగిలిన 25 మంది జెడ్పీటీసీ సభ్యులు జిల్లా ఎన్నికల అధికారి సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికైన జెడ్పీటీసీ సభ్యులందరికీ కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. నాగాయలంక మండల జెడ్పీటీసీ సభ్యురాలు భోగాది రమాదేవి పేరును పమిడిముక్కల మండల జెడ్పీటీసీ సభ్యురాలు తాతినేని ప్రవళి ప్రతిపాదించగా, ఘంటసాల మండల జెడ్పీటీసీ సభ్యురాలు దోవారి పవిత్ర బలపరిచారు. ఈ నేపథ్యంలో భోగాది రమాదేవి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించారు.అదేవిధంగా జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక ప్రక్రియలో కంకిపాడు మండల జెడ్పీటీసీ సభ్యురాలు దండమూడి పూజిత పేరును మచిలీపట్నం దక్షిణ మండల జెడ్పీటీసీ సభ్యుడు కాగిత వెంకటేశ్వరరావు ప్రతిపాదించగా, గుడ్లవల్లేరు మండల జెడ్పీటీసీ సభ్యుడు వర్రే బలరామకృష్ణ బలపరిచారు. దీంతో దండమూడి పూజిత వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైనట్లు జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించారు.చైర్‌పర్సన్‌గా భోగాది రమాదేవి, వైస్ చైర్‌పర్సన్‌గా దండమూడి పూజిత ఎన్నికైన అనంతరం వారిద్దరితో జిల్లా ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాలను అందజేసి, వారిని అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజి మాట్లాడుతూ, జిల్లా పరిషత్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలని ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, జెడ్పీటీసీ సభ్యులకు సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా సభ్యుల ప్రమాణ స్వీకారం, ఎన్నిక ప్రక్రియను కృష్ణా జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు వి. అభిషేక్ పర్యవేక్షించారు. కార్యక్రమానికి అవనిగడ్డ, పామర్రు, పెడన నియోజకవర్గాల శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్ హాజరయ్యారు.కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ఎం శ్రీహరి, డిప్యూటీ సీఈఓ డాక్టర్ ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.
కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా భోగాది రమాదేవి, వైస్ చైర్‌పర్సన్‌గాదండమూడి పూజిత లకు అభినందనలు శుభాకాంక్షలు తెలియజేసిన,భారతీయ జనతా పార్టీ కృష్ణాజిల్లా లీగల్ సెల్ కన్వీనర్ సిద్ధినేని శ్రీ సత్యసాయి బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శం...

రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం...
విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షుడు అందే సురేష్...



చిగురుమామిడి నవంబర్ 20 (మీ వార్త విలేకరి సొన్నాయిల భరత్):
రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు యావత్ దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షుడు అందే సురేష్ పేర్కొన్నారు.శుక్రవారం చిగురుమామిడి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద,మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు.ముఖ్యంగా రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ధీమా కల్పించేలా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రవేశపెట్టడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు.ఆపద సమయంలో ఆయా కుటుంబాలకు ఈ బీమా పథకం ఎంతో ఆసరాగా నిలుస్తుందని తెలిపారు.ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతోందని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కార్యకర్తలు,నాయకులు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్,సర్పంచులు అకవరం భవాని శివప్రసాద్, అలువాల శంకర్,గుళ్ళ రజిత రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సాంబారి బాబు, ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు గుడిసె మల్లికార్జున్, కురేళ్ళ కిషోర్,కొర్రి సదానందం,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు వెళ్లొస్తుండగా రెండు బస్సుల మధ్య నలిగి మహిళ మృతి..

₹లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేసిన పొన్నం

సిద్దిపేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభకు హాజరై తిరిగి ఇంటికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న ఓ మహిళను మృత్యువు కబళించింది. బస్సు ఎక్కే క్రమంలో పక్క నుంచి మరో బస్సు రావడంతో రెండింటి మధ్య చిక్కుకుని ఆమె ప్రాణాలు కోల్పోయింది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబంలో ఈ ఘటన తీరని విషాదాన్ని నింపింది. గురువారం సిద్దిపేటలో నిర్వహించిన ముఖ్యమంత్రి సభకు హుస్నాబాద్ మండలం నాగారం గ్రామానికి చెందిన కొమ్ము సారవ్వ (55) హాజరైంది. సభ ముగిసిన తర్వాత స్వగ్రామానికి వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా ప్రమాదం జరిగింది. ఆమె ఎక్కుతున్న బస్సు పక్క నుంచి మరో బస్సు రావడంతో రెండు వాహనాల మధ్య ఇరుక్కుపోయింది. తీవ్ర గాయాలైన సారవ్వ అక్కడికక్కడే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. సారవ్వ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేది. ఆమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఇప్పటికే పేదరికంలో ఉన్న కుటుంబానికి ఆమె మరణం తీరని లోటుగా మారింది.

సొంత ఆదాయమే పంచాయతీల అభివృద్ధికి కీలకం

-మొదటిపేజీ తరువాయి

గ్రామ పంచాయతీలకు గాను 11,025 పంచాయతీల గణాంకాలను పరిగణనలోకి తీసుకుంది. సొంత ఆదాయాన్ని సమకూర్చుకోవడంలో, స్థానిక పన్నుల వాటాను పెంచుకోవడంలో తెలంగాణ పంచాయతీలు సానుకూల పనితీరు కనబరుస్తున్నాయని నివేదిక పేర్కొంది. అయితే ప్రభుత్వ గ్రాంట్లపై ఆధారపడే పరిస్థితిని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని సూచించింది. దేశవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు సమకూరుతున్న మొత్తం ఆదాయంలో దాదాపు 90 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే గ్రాంట్ల రూపంలోనే ఉంటోందని నివేదిక వెల్లడించింది. స్థానిక సంస్థలు సొంత ఆదాయ వనరులను విస్తరించుకోవడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని పేర్కొంది.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

గ్రామీణ ప్రాంతాల్లో మహిళల యాజమాన్యంలోని సంస్థల వాటా 40 శాతానికి మించి ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఒకటిగా నిలిచిందని నివేదిక తెలిపింది. మహిళా స్వయం సహాయక సంఘాలు, ఆర్థిక సహకారం, మెరుగైన మౌలిక సదుపాయాలు మహిళా పారిశ్రామికవేత్తల ఎదుగుదలకు దోహదపడుతున్నాయని విశ్లేషించింది. ఉపాధి హామీ పథకం నిధుల వినియోగంలోనూ గ్రామీణ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొంది.

పట్టణ పంచాయతీలుగా మార్పుపై జాగ్రత్తలు

వేగంగా అభివృద్ధి చెందుతున్న గ్రామ పంచాయతీలను టౌన్ పంచాయతీలు లేదా పట్టణ స్థానిక సంస్థలుగా మార్చే అంశంపైనా ఆర్బీఐ కీలక సూచనలు చేసింది. పట్టణ స్థానిక సంస్థలుగా మారినప్పుడు ఆస్తి పన్ను వంటి ఆదాయ వనరులు పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, రహదారులు, సిబ్బంది నిర్వహణ వంటి ఖర్చులు కూడా పెరుగుతాయని తెలిపింది. గ్రామీణ పథకాల ద్వారా లభించే ప్రయోజనాలు తగ్గే అవకాశం ఉన్నందున, మార్పునకు ముందు ఆర్థిక, పరిపాలనా సన్నద్ధతను అంచనా వేయాలని సూచించింది.

ఏపీలో 60.4 శాతం.. తెలంగాణలో 53.6 శాతం

గ్రామ పంచాయతీలు ఆర్థికంగా బలోపేతం కావాలంటే సొంత ఆదాయ వనరులను పెంచుకోవడంతో పాటు పన్నుల వసూళ్ల సామర్థ్యాన్ని మెరుగుపరచుకోవాలని ఆర్బీఐ సూచించింది. తెలంగాణ గ్రామ పంచాయతీలు సమకూర్చుకుంటున్న సొంత ఆదాయంలో 53.6 శాతం స్థానిక పన్నుల ద్వారా వస్తోందని వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈ వాటా 60.4 శాతంగా ఉందని పేర్కొంది. రెండు రాష్ట్రాల్లోనూ పంచాయతీల సొంత ఆదాయంలో స్థానిక పన్నులే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని తెలిపింది.

నిధుల వినియోగంలో పారదర్శకత అవసరం

పంచాయతీల ఆస్తుల వివరాలను డిజిటలైజ్ చేయడం, పన్నుల విధింపు, వసూళ్లలో పారదర్శకత పెంచడం, నిధుల వినియోగంపై జవాబుదారీతనం కల్పించడం కీలకమని ఆర్బీఐ సూచించింది. రాష్ట్ర ఆర్థిక సంఘాలను సకాలంలో ఏర్పాటు చేసి, వాటి సిఫార్సుల మేరకు నిధుల కేటాయింపులు జరగాలని స్పష్టం చేసింది. స్థానిక సంస్థలకు తగిన ఆర్థిక వనరులు, పరిపాలనా వ్యవస్థ అందుబాటులో ఉన్నప్పుడే గ్రామీణాభివృద్ధి లక్ష్యాలను సమర్థంగా సాధించగలమని నివేదిక పేర్కొంది.

తెలంగాణ ఉద్యమంలో చుక్కా రామయ్య సేవలు మరువలేనివి

-మొదటిపేజీ తరువాయి

ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. ప్రజా ప్రభుత్వం ఆయన సూచనలు, సలహాలతో ముందుకు సాగుతుందని తెలిపారు.

స్వాతంత్ర్య పోరాటం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు..

చుక్కా రామయ్య శతజయంతి తెలంగాణ ప్రజలందరూ గర్వించదగిన రోజని



మెగాస్టార్ విశ్వంభర.. అదొక్కటే బ్యాలెన్స్..!

మెగాస్టార్ ఫ్యాన్స్ ఎన్నో రోజులుగా ఎదురు చూస్తోన్న చిత్రాల్లో విశ్వంభర ఒకటి. ఇప్పటికే రిలీజ్ కావాల్సినా ఈ సినిమా పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పటికీ ఈ సినిమా రిలీజ్ తేదీని ఇంకా ప్రకటించలేదు మేకర్స్. ఈ చిత్రానికి బింబిసార ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్నారు. మరోవైపు మెగాస్టార్ అభిమానులు కాకా మూవీ కోసం వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే విశ్వంభరకు సంబంధించి క్రేజీ టాక్ వినిపిస్తోంది. ఎట్టకేలకు ఈ సినిమా మళ్లీ ట్రాక్‌లోకి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమా ట్రైలర్ కట్ సహా డబ్బింగ్ వర్క్ శరవేగంగా జరుగుతోందని లేటెస్ట్ టాక్. ఇప్పటికే ట్రైలర్ కూడా సిద్ధమైనట్లు సమాచారం. మరోవైపు డబ్బింగ్ పనులు సైతం త్వరగా పూర్తి చేయాలని మేకర్స్ టార్గెట్‌గా పెట్టుకున్నారట. ఇదంతా చూస్తుంటే విశ్వంభర మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందని అర్థమవుతోంది. అయితే ఈ మూవీ రిలీజ్ తేదీని రివీల్ చేయాల్సి ఉంది. దీనిపై కూడా త్వరలోనే క్లారిటీ వచ్చేలా కనిపిస్తోంది. ఇదంతా చూస్తుంటే విశ్వంభరకు లైన్ క్లియర్ అయినట్లేనని మెగా ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇక రిలీజ్ తేదీనిఎప్పుడు రివీల్ చేస్తారో తెలియాల్సి ఉంది. కాగా.. ఈ చిత్రంలో త్రిష, ఆషిక రంగనాథ్ హీరోయిన్స్‌గా నటించారు. ఈ మూవీకి కీరవాణి, గౌర హరి సంగీతమదించగా.. ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌లో నిర్మించారు.

అది నాన్న-కూతురు బంధం..

మిస్కిన్ వివాదంపై స్పందించిన కీర్తి సురేష్!



చెన్నైలో జరిగిన 'సత్యవాన్ సావిత్రి' చిత్ర ప్రెస్ కాన్ఫరెన్స్‌లో దర్శకుడు మిస్కిన్ తనను ప్రశంసిస్తూ తొడ భాగం వైపు స్వల్పంగా తాకిన వీడియో వైరల్ అయిన నేపథ్యంలో నటి కీర్తి సురేష్ సోషల్ మీడియా వేదికగా ఘాటుగా స్పందించారు. ఈ వీడియోపై నెట్టింట పలువురు భిన్నంగా వ్యాఖ్యానించగా, ఒక యూజర్ ఆమె అసౌకర్యంగా ఉన్నట్లు కనిపించారని పేర్కొంటూ, సినిమాల్లో సన్నివేశాల కోసం తాకినప్పుడు బయట అలాంటి వాటికి ఎందుకు అంగీకరించరని ప్రశ్నించారు. దీనిపై సోషల్ మీడియా వేదికగా కీర్తి సురేష్ స్పందిస్తూ, తన ముఖంలో అసౌకర్యం ఎక్కడ కనిపించిందని ప్రశ్నించారు. తమ మధ్య తండ్రీకూతుళ్ల తరహా బంధం ఉందని తాము చెప్పిన మాటలు వినిపించలేదా అని నిలదీశారు. ఒకవేళ తాను అసౌకర్యంగా ఉన్నా, సినిమాల్లో తాకుతారు కాబట్టి బయట కూడా అలాగే ఉండాలని చెప్పడం సరికాదని హితవు పలికారు. కొన్ని విషయాలను సరిగ్గా అర్థం చేసుకోవాలని ఆ నెటిజన్‌కి చురకలంటించారు. కీర్తి సురేష్ స్పందన తర్వాత ఆ నెటిజన్ తన పోస్ట్‌ను తొలగించి, తనకు ఎలాంటి చెడు ఉద్దేశం లేదని క్షమాపణ కోరారు. మరోవైపు, ఈ వ్యవహారంలో ఎలాంటి అసౌకర్యం గానీ, దురుద్దేశం గానీ లేదని కీర్తి స్పష్టం చేశారని మరికొందరు నెటిజన్లు కూడా పేర్కొన్నారు.

బాక్సాఫీస్ వద్ద 'ఈఎన్ఈ రిపీట్' దూకుడు..

తొలి రోజే రూ.15 కోట్ల వసూళ్లు!

తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వచ్చిన 'ఈఎన్ఈ రిపీట్' బాక్సాఫీస్ దగ్గర తొలి రోజే మంచి వసూళ్లను రాబట్టింది. 2018లో వచ్చి కల్ట్ ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఈ నగరానికి ఏమైంది సినిమాకు సీక్వెల్‌గా వచ్చిన ఈ చిత్రం, మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.15.27 కోట్లకు పైగా వసూళ్లు సాధించిందని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అంతేకాకుండా, తొలి రోజే పార్ట్-1 లైఫ్‌టైమ్ కలెక్షన్లను దాటేసిందని చిత్రబృందం తెలిపింది. తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో వివేక్ సాగర్ సంగీతంతో వచ్చిన ఈ సినిమాను ఎస్ ఒరిజినల్స్, రూట్ నోడ్ సినిమా సంస్థలు నిర్మించాయి. విశ్వక్ సేన్, అభినవ్ గోమటం, శ్రీనాథ్ మాగంటి, వెంకటేష్ కాకుమాను, అనీషా అంబ్రోస్, శివాత్మిక రాజశేఖర్ ఈ గ్యాంగ్‌తో కలిసి మరోసారి సందడి చేశారు. మరోవైపు ఈ సినిమా పార్ట్1కి ఉన్న క్రేజ్ వలన ఓవర్సీస్‌లో కూడా దూసుకుపోతుంది.



తల్లిదండ్రులైన సమంత - రాజ్ నిడిమోరు..

కొడుకుకు 'దేవ్ నిడిమోరు' అని నామకరణం!

టాలీవుడ్ నటి సమంత రూత్ ప్రభు, రాజ్ నిడిమోరు తల్లిదండ్రులయ్యారు. ఈ జంటకు పండంటి మగబిడ్డ జన్మించగా, తమ చిన్నారికి 'దేవ్ నిడిమోరు' అని పేరు పెట్టినట్లు తెలుస్తోంది. ఇంటికి కొత్త సభ్యుడి రాకతో ఇరు కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సంతోషకర విషయాన్ని పంచుకుంటూ సమంత సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ ఫోటోను పోస్ట్ చేసింది. తమ ముద్దుల కొడుకు చిట్టి వేళ్లను పట్టుకుని ఉన్న ఆ చిత్రం నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇక తల్లిదండ్రులుగా కొత్త బాధ్యతల్లోకి అడుగుపెట్టిన సమంత, రాజ్ నిడిమోరులకు సినీ పరిశ్రమలోని సహచరులు, స్నేహితులు, అభిమానులు పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. చిన్నారి దేవ్ నిడిమోరుకు ఆయురారోగ్యాలు, సకల సంతోషాలు కలగాలంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.